# నినాదం
నిఖార్సైన జర్నలిజం

గురువారం 28 నవంబర్ 2024 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 12


## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి,(నినాదం న్యూస్)**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కాటేపల్లి గ్రామానికి చెందిన జర్పుట శ్రీకాంత్ (22) పోతేపెల్లికి బైకుపై వెళ్తుండగా అదుపుతప్పి టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో అతని తలకు బలంగా గాయమైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీకాంత్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను
# సద్వినియోగం చేసుకోవాలి

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిపరిశీలించిన కలెక్టర్

**రైతులు మధ్య దళారులను ఆశ్రయించవద్దు...**
**సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు..**
**మండల స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయాలి...**
**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్...**



కోదాడ (రూరల్),నవంబర్ 27 (నినాదం న్యూస్):
ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ రైతులకు సూచించారు. బుధవారం కోదాడ పిఏసిఎస్ పరిధిలోని తమర బండపాలెం, నల్లబండగూడెంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇచ్చిన గైడ్లైన్స్ ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రం నడుస్తుందని అన్నారు. రైతులు పంటను తీసుకుని వచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టుకుని కొనుగోలు నిర్వాహకులకు సహకరిస్తున్నారని అన్నారు.

జిల్లావ్యాప్తంగా 60 వేల ఎంటీ లకు పైగా ధాన్యం కొనుగోలు చేసామన్నారు. రైతులకు కూడా వారి నగదు బ్యాంకులలో నమోదు చేయడం జరుగుతుంది అన్నారు. మండల స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాల న్నారు. తాసిల్దార్ ,ఎంపీడీవో మండల వ్యవసాయ అధికారిని, పోలీసులు, ఐకెపి సెంటర్ ఉంటే ఏపీఎం, లేక పిఏసిఎస్ ఉంటే వాటికి సంబంధించిన వారితో కలిపి ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ కమిటీ సభ్యులు మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి అని వారికి ముందోస్తు ఆదేశాలు ఉన్నాయి అన్నారు. జిల్లాలో కూడా సంబంధించిన అధికారులతో డైలీ వీడియో కాన్ఫరెన్స్ గాని, టెలి కాన్ఫరెన్స్ గాని తీసుకుని ఆ మండలంలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగే విధంగా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు సజావుగా సాగడం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తూన్నామ న్నారు. కొంతమంది రైతులు తొందరపడి ముందుగానే కోతలు కోస్తున్నారని చేస్తున్నా రని అన్నారు. పంట సజావుగా కోతకు వచ్చినప్పుడే కోయాలని సూచించారు. ముందుగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసుకోవడానికి స్థలం సరిపోడం లేదని ఎక్కడ ఆరబోసుకోవాలో అర్థం కాని పరిస్థితి అనీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కరిస్తామని మరికొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం పిఏసిఎస్ సిబ్బందిని టక్ షీట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమర బంద పాలెం లో గల పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ తాసిల్దార్ వాజిద్ అలీ ఏవో రజిని ఏఈవో సీఈవోలు పాల్గొన్నారు.

## అనంతగిరిలో గ్రంథాలయం కరువు..

### దిక్కుతోచక ఆయోమయంలో నిరుద్యోగ యువత



- ప్రిపేర్ అయ్యేందుకు ఇక్కట్లు
- కోదాడ పట్టణానికి వెళ్లాల్సి వస్తుందంటున్నా నిరుద్యోగులు..
- గ్రంథాలయ ఏర్పాటుకై పెరుగుతున్న డిమాండ్...

వివరాలు 7లో

జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన మండలాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2016 వ సంవత్సరంలో ఏర్పడిన అనంతగిరి మండలం ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశారు. అన్ని శాఖలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపయోగపడే గ్రంథాలయం ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

కోదాడ, నవంబర్ 27(నినాదం న్యూస్)



వివరాలు 2లో

### యథేచ్ఛగా ఫిల్టర్
# ఇసుక దందా..!
### ఇసుక రవాణాకు అడ్డూ అదుపు లేదు..!

**భీమదేవరపల్లి నవంబర్ 27(నినాదం న్యూస్):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఫిల్టర్ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతుంది. వాగులు, వంకల నుండి ఇసుకను తీసుకొచ్చి నీటితో శుభ్రం చేసి జనానికి అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని ముల్కనూరు, కొత్తకొండ, గట్ల నర్సింగాపూర్, వంగర తదితర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక కేంద్రాలను బహిరం గంగానే నిర్వహిస్తున్నారు.

వివరాలు 2లో

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**తహసీల్దార్ హరికృష్ణ**
**-విద్యార్థులు బాగా చదువుకొని గొప్ప స్థాయికి చేరుకోవాలి**
**-విద్యార్థులతో కలిసి భోజనం..**
**-చౌటుప్పల్ తహసిల్దార్ హరికృష్ణ**



# సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందేలా చర్యలు

### అధికారులకు కలెక్టర్ సత్య శారద ఆదేశాలు



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్):** సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాలు తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా నియమించిన 46 మంది జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో రెండు రోజుల పాటు విస్తృతంగా తనిఖీలు చేసి అక్కడి పరిస్థితులపై అధికారులు నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించిన మేరకు తనిఖీ చేసి అధికారులు నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నివేదిక ఆధారంగా సక్రమంగా నిర్వహణ జరగని సంబంధిత సంక్షేమ వసతి గృహం, ప్రభుత్వ విద్యా సంస్థలు, పాఠశాలల బాధ్యులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అధికారులు తరచుగా ఆయా మండలాలలోని వసతి గృహాలకు ప్రభుత్వ విద్యా సంస్థలకు ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌళిక వసతులు కల్పించేలా చూడాలన్నారు.

### యథేచ్ఛగా ఫిల్టర్

# ఇసుక దందా..!

### ఇసుక రవాణాకు అడ్డూ అదుపు లేదు..!



**భీమదేవరపల్లి నవంబర్ 27(నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఫిల్టర్ ఇసుక దందా యథేచ్చగా సాగుతుంది. వాగులు, వంకల నుండి ఇసుకను తీసుకొచ్చి నీటితో శుభ్రం చేసి జనానికి అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని ముల్కనూరు, కొత్తకొండ, గట్ల నర్సింగాపూర్, వంగర తదితర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక కేంద్రాలను బహిరంగంగానే నిర్వహిస్తున్నారు. నాణ్యతలేని ఇసుకను జనానికి అంటగడుతున్నా, అధికారులూన్ఏమాత్రం నియత్రించ లేక పోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా ఇసుక దందాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. వాగులు, వంకల్లో ఇసుక మేటల్ని అక్రమార్కులు తొలత గుర్తిస్తారు. మట్టితో పాటు ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపుతారు. ఇసుక నుంచి మట్టిని వేరు చేసేందుకు తీవ్ర ఒత్తిడితో నీటిని పంప్ చేస్తారు. నీటి తాకిడికి మట్టి కిందకు జారిపోతుంది. ఇలా పలుమార్లు నీటితో ఇసుకను కడిగి, అలా వచ్చిన ఇసుకను వినియోగదారులకు అమ్మేస్తారు. ట్రాక్టర్ ఇసుకను సుమారు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తారు. వాల్టా చట్టం ప్రకారం ఫిల్టర్ ఇసుక నిర్వహించడం నిబంధనలకు విరుద్ధం. ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమార్కులు నీళ్లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో మోటార్లతో నీటిని తోడి ఇసుకను ఫిల్టర్ చేస్తున్నారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అధికారులు ఇప్పటివరకు పట్టుకున్న దాఖలాలు లేకపోవడంతో,ఇసుక అక్రమ రవాణా అధికారుల అండదండలతోనే నడుస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిద్రావస్థ మాని నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై ఉక్కు పాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

# ఐకమత్యంతో సమస్యలను ఎదుర్కోవాలే....

### - గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు





**ములుగు ప్రతినిధి (నినాదం):** ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులు ఐకమత్యంగా ఉండి ఎలాంటి సమస్యలు వచ్చినా ఐకమ త్యంగా ఎదుర్కోవాలని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రం లోని జెడ్పీహాల్‌లో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ ను జిల్లా అధ్యక్షుడు మట్టపల్లి సంపత్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలలో ఉన్న సమస్యలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అలాగే శనివారం హైదరాబాద్ లో జరగనున్న స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి విన్నవించాల్సిన సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహన్ రావు మాట్లాడుతూ సమస్య ఎదురైతే అధికారులంతా ఒక్కతాటిపైకి రావాలని, అలా జరిగినప్పుడే సమస్యలు దరిచేరవన్నారు. ఈ సందర్బంగా నిర్మల్ జిల్లా దిలావపూర్ ఆర్డిఓ రత్న కళ్యాణి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కోల రాజేష్ కుమార్, సెక్రెటరీ జీవన్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు డాక్టర్ కెమసారం కొమురయ్య, సంతోష్, బి .శ్రీనివాస్, శైలజ, రహీం, జి రాజ్ కుమార్, యశ్వంత్, దుర్గారావు, జే రంజిత్, శంకర్ రావు, బాలయ్య, నరసింహ, సారంగ పాణి,రాజేశ్వర్, శిరీష, నరసింహ, విద్యాసాగర్, మాధవి శీతల్, రాజేశ్వరరావు, డి రాజు, రహీం మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం





**కాటారం నవంబర్ 27 నినాదం న్యూస్ ):** జయశంకర్ భూపాల పల్లి జిల్లా కాటారం మండలంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పై కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించారు ఇందులో భాగంగా కాటారం మరియు మండలంలోని నస్తూర్ పల్లి, ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం పరిశీలించారు. సెంట్రల్ సెక్రెటరీ సెక్షన్ ఆఫీసర్ల శిక్షణలో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ పాండు,సెరిగ్రేషన్ షెడ్డు, క్రీమటోరియం వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనం, నర్సరీ మొదలగుపనులను సందర్శించారు. ఉపాధి కూలీలతో పనుల వివరాలు, చెల్లింపుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ వస్తున్నదా లేదా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు . కేంద్ర బృందంతో కాటారం మండల ఏపీవో వెంకన్న, ఈసీ మెంబర్ శ్రీనివాస్,టెక్నికల్ అసిస్టెంట్ మనోజ్, పంచాయతీ కార్యదర్శిలు షగీర్ ఖాన్, సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేష్, నీతి అయోగ్ బృందం ఉన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

**తహసీల్దార్ హరికృష్ణ**
**-విద్యార్థులు బాగా చదువుకొని గొప్ప స్థాయికి చేరుకోవాలి**
**-విద్యార్థులతో కలిసి భోజనం..**
**-చౌటుప్పల్ తహసిల్దార్ హరికృష్ణ**



**చౌటుప్పల్ నవంబర్ 26(నినాదం న్యూస్)** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చౌటుప్పల్ తహసిల్దార్ హరికృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆదేశానుసారం అధికారులు ప్రభుత్వ హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల నిర్వహణ లో భాగంగా చౌటుప్పల్ తహసిల్దార్ హరికృష్ణ, అంగన్వాడి సూపర్వైజర్ సి.సువర్ణ తో కలిసి చౌటుప్పల్ మండల కేంద్రం లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా పర్యటించి తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్, బియ్యం స్టాక్ రిజిస్టర్, స్టాక్ రూమ్ పరిశుభ్రత,కూరగాయలు, వంట సామాగ్రి నాణ్యతలను, హాస్టల్ లోని మౌలిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, విద్యార్థుల భద్రత, మరుగుదొడ్లు,విద్యుత్ సదుపాయం, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులతో పాటు,స్టాక్ రూమ్ లోని వస్తువులపై ఎక్స్పైరీ డేట్ లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను విద్యార్థులను,హాస్టల్ కేర్ టేకర్ మల్లికను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో విద్యార్థులకు అందుతున్న మెనూ, వసతులు,సదుపాయాలు పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవలంబించాల్సిన విషయ పరిజ్ఞానం పై తగిన సూచనలు, సలహాలను విద్యార్థులకు అందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని గొప్ప స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ప్రతిరోజు మెనూ ప్రకారము విద్యార్థులకు భోజనం అందించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ సి సువర్ణ బాలికల హాస్టల్ ల్లో రాత్రి బస చేశారు.

## భారత న్యాయ చరిత్రలో

# కొత్త అధ్యాయం




**- ఇక ఓన్లీ బీ.ఎన్.ఎస్..మూడు కొత్త న్యాయ చట్టాలు అమలు**

**- బ్రిటీష్ వలస చట్టాలకు చెల్లు చీటీ.**

**- కనుమరుగు కానున్న ఐపీసీ,సిఆర్ పీసీ సెక్షన్లు**

**- నిబంధనల లెక్కలలో పెను మార్పులు**

**- 90 రోజుల్లో దర్యాప్తు.. 60 రోజుల్లో తీర్పు.**

**వైరా నవంబర్ 27 (నినాదం న్యూస్)**

భారత న్యాయ వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచింది.మన దేశంలో బ్రిటిష్ వలస పాలన నుంచి కొనసాగుతున్న చట్టాలు కనుమరుగు కానున్నాయి.కొత్త చ ట్టాలు 2024 జూలై 1.సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి.బ్రిటిష్ కాలం నా టి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)ఇక మీదట భారతీయ న్యాయ సంహితగా(బీ.ఆ న్.ఎస్),కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్ పీసీ) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీ.ఎన్.ఎస్)గా,ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్..భారతీయ సాక్ష అధినియమ్ (బీ.ఎస్.ఏ)గా మారాయి. ఈ మూడు న్యాయ చట్టాలలో పలు విప్లవాత్మక అంశాలను చేర్చా రు.నేరాల దర్యాప్తు,శిక్షలు,కోర్టు కేసుల విచారణ,సాక్ష్యాల సేకరణ..ఇలా ప్రతీ అంశ ములో సంస్కరణలు స్పష్టంగా కనిపించేలా కొత్త చట్టాలు ఉన్నాయి.పోలీస్ కేసుల విచారణ విధానాలలో ఆధునికతను వినియోగిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసేలా ఈ చట్టాలను రూపొందించారు.అలాగే కొత్త చట్టం ప్రకారం ఏదైనా నేర దర్యా ప్తు 90 రోజుల్లో పూర్తి కావాలి..ఆలోపే చార్జి షీటు దాఖలు చేయాలి.అప్పటి వరకు పూర్తి కా కపోతే అనుమతితోనే మరో 90 రోజులు దర్యాప్తు కొనసాగించవచ్చు.కోర్టులో కేసు లుపై వాదనలు పూర్తయిన 30 రోజుల్లో గా కోర్టులు తీర్పులను వెలువరించాలి.పరి స్థితులు బట్టి మరో 30 రోజుల వరకు సమయాన్ని పొడిగించుకునే అవకాశం ఉంటుంది. గతంలో ఏళ్ల తరబడి కొనసాగిన కోర్టు విచారణలు ఇక పై కనిష్టముగా ఏడు రో జుల్లోనే తీర్పు ఇచ్చేందుకు కొత్త చట్టాలు అవకాశం కల్పిస్తున్నాయి.

**కఠిన చట్టాలు..**



ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)163 ఏళ్ళ కిందటిది.దాని స్థానంలో తీసుకొచ్చిన భా రతీయ న్యాయ సంహిత (బీ.ఆన్.ఎస్)లో కీలక మార్పులు తెచ్చారు.ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా,బి.ఎన్.ఎస్ లో 358 సెక్షన్లు మాత్రమే ఉన్నాయి.ఇందులో కొత్తగా 2 0 నేరాలను చేర్చారు.బిక్షాటన,మానవ అక్రమ రవాణాను కఠిన నేరంగా పేర్కొన్నా రు.అలాగే పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి శారీరకంగా కలిశాక మోసం చేస్తే పదేళ్ల జైలు శిక్షతోపాటు భారీ జరిమానా విధించనున్నారు.చట్ట విరుద్ధమైన కార్యకలాపా ల జాబితాలో..కిడ్నాప్,దోపిడీ,వాహనాల చోరీ,బలవంతంగా భూమి లాక్కోవడం, కాంట్రాక్ట్ హత్యలు,ఆర్థిక నేరాలు,సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల సరఫరా,ఆయుధా ల సరఫరా..వంటివి పాల్పడితే కఠిన శిక్షించేందుకు చట్టాలు చేశారు.దేశ ఐక్యత,స మగ్రత, సార్వభౌమాధికారం,ఆర్థిక భద్రతకు ముప్పు కలిగించే చర్యలను తీవ్రవాద చర్యగా కొత్త చట్టంలో చేర్చారు.

**ఫోరెన్సిక్ తప్పనిసరి...**

క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు మరింత పకడ్బందీగా జరగడానికి వీలుగా తీవ్రమైన నేరా లలో సాక్ష్యాల సేకరణకు ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలాన్ని సందర్శించడాన్ని తప్పనిసరి చేశారు.ఏడేళ్లు జైలు శిక్ష విధించే నేరాలకు ఫోరెన్సిక్ విచారణకు తప్పని సరి చేశారు.లైంగిక దాడి బాధితులను పరీక్షించే వైద్య నిపుణులు ఏడు రోజుల్లోగా తమ నివేదికలను దర్యాప్తు అధికారికి సమర్పించాలి.అలాగే అండర్ ట్రయల్ ఖైదీ ల కోసం ఒక ముఖ్యమైన సెక్షన్ ను రూపొందించారు.మహిళలపైనేరాలకుశిక్షలుకఠినము చేశారు.మహిళలు,పిల్లలు,హత్యలు,ప్రభుత్వ వ్యతిరేక నేరాలకు కొత్త బిల్లు లో బిఎన్ఎస్ బిల్లు సెక్షన్ 69 కింద కఠిన శిక్షలు విధించనున్నారు.పోలీసులు నేర ప రిశోధన,చలానాల విధింపు ప్రక్రియను తప్పనిసరిగా వీడియో తీయాలి.పరార్ లోఉ న్న వారిని కూడా విచారించే అవకాశం కల్పిస్తారు.ఈ-ఎఫ్ ఆర్ ను ఎక్కడి నుంచై నా నమోదు చేయవచ్చు.సాక్షులు,బాధితులు,నిందితులు..ఎవరైనా ఎలక్ట్రానిక్ విధాన ములో కోర్టులో హాజరు కావచ్చు.ఎఫ్ ఐ ఆర్ నుంచి కేసు డైరీ,చార్జ్ షీట్ నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ సహా న్యాయం జరిగే వరకూ అన్ని డిజిట లైజ్ చేస్తారు.పోలీసులు, న్యాయ వాదులు,న్యాయమూర్తుల జవాబు దారీ తనములో వ్యవరించేలా కొత్త బి ల్లుల్లో నిబంధనలు పొందుపరిచారు.

**చట్టాలలో సవరణ అవసరం..**

కొత్త క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా పలు కేంద్ర-రాష్ట్ర చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందని న్యాయం నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఒకవేళ ఆదిశగా సవరణ లు చేయకుంటే కేంద్ర-రాష్ట్ర చట్టాలతో ముడిపడిన కేసులు భారీగా పెండింగ్ లో పడి పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వీటిలోని కొన్ని అంశాలపై అ భ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.కొత్త న్యాయ చట్టాలను ప్రజాస్వామ్య ప్రక్రియ ను అనుసరించకుండా ఏకపక్షంగా తయారు చేశారని పలు ప్రజాసంఘాలు అభిప్రా యం వ్యక్తం చేస్తున్నాయి.

---

## భాగ్యరథి కళాశాలలో

# సాధారణ ఎన్నికలను తలపించిన విద్యార్థులకు అవగాహన ఎన్నికలు

**కుత్బుల్లాపూర్, నవంబర్ 27 (నినాదం న్యూస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ లోని భాగ్యరథి జూనియర్ కళాశాల లో విద్యార్థులకు సాధారణ ఎన్నికల విధానంపై అవగాహన కలిగించుటకు విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియను ఏర్పాటు చేశారు. మాక్ అసెంబ్లీ పెట్టి అందులో సీఎం రోల్, ప్రతిపక్ష పార్టీ లీడర్, స్పీకర్ రోల్ చేయుటకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించి అవగాహన కల్పించారు. అందుకుగాను ఆరుగురు సీనియర్ విద్యార్థులు అర్జున్ మౌర్య డి.ప్రేమ్ కుమార్, ఎం.సాయి చరణ్ ,మహమ్మద్ అఫ్రోజ్ మహమ్మద్ తాజుద్దీన్ , మహమ్మద్ బిలాల్ ఎన్నికలలో పోటీ చేశారు. 22-11-24 నుండి25-11-24 వరకు నామినేషన్ సమర్పించారు.26-11-24 అభ్యర్థులకు కావలసిన ఎన్నికల గుర్తులు కేటాయించడం, ప్రచారం చేసుకోవడం జరిగింది. 27-11-24 నా బ్యాలెట్ పేపర్, సీక్రెట్ బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటింగు సీనియర్ బాయ్స్ వినియోగించుకోగా 245 మంది విద్యార్థులలో 175 మంది ఓటింగ్ లో పాల్గొన్నారు. ఉదయం10 గంటల నుండి 12 గంటల వరకు ఒక క్రమ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం12 గంటల తర్వాత బ్యాలెట్ బాక్స్ తెరిచి కౌంటింగ్ ప్రారంభించగా మహమ్మద్ తాజుద్దీన్ కు 81 ఓట్లతో ప్రథమ స్థానంలో సీఎం అభ్యర్థిగా ఎంపికైనారు. డి .ప్రేమ్ కుమార్ 36 ఓట్లతో ద్వితీయ స్థానంలో ప్రతిపక్ష లీడర్ గా, మహమ్మద్ బిలాల్ 26 ఓట్లతో స్పీకర్గా ఎంపికైనారు. ఓటింగ్ లో పాల్గొన్న విద్యార్థులు అందరూ చాలా ఆనందాన్ని వ్యక్తం పరచడం జరిగింది. మాక్ అసెంబ్లీ జరపడానికి తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి విద్యార్థులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎన్.వెంకట్ రెడ్డి ,సిహెచ్.గోవిందరెడ్డి




జి.రమేష్ బాబు, కె.రామకృష్ణ, నల్ల జై శంకర్ గౌడ్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.





# ఆస్తమాపై అప్రమత్తత అవసరం





**హైదరాబాద్, నవంబర్ 28 (నినాదం న్యూస్)**
ఆయుర్వేద వైద్య విధానంలో ప్రకృతి పరంగా లభించే సంప్రదాయ వనమూలికల ద్వారా వివిధ రోగాలను సులభంగా నయంచేయొచ్చు. చలికాలంలో వచ్చే ఆస్తమా లేదా ఉబ్బసం వ్యాధిని నయం చేసే వైద్య పద్ధతులు ఆయుర్వేద వైద్య విధానంలో ఉన్నాయి. ఆస్తమా సోకిన వారు భయపడకుండా సులభంగా డాక్టరు సూచించే ఆయర్వేద తైలాలు, మూలికలు, మిశ్రమాలు, మందులను వాడటం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆస్తమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13 శాతం మంది బాధపడుతున్నారు. మరణాల్లో 42 శాతం మనదగ్గరే సంభవిస్తున్నాయి.

ఏటేటా శీతాకాలంలో చల్లటి వాతావరణం, ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి తగ్గిపోతుండటం తెలిసిందే. ఈ కాలంలో సామాన్యంగా ప్రతిఒక్కరిలో రోగ నిరోధక శక్తి మరింత పడిపోయి ఆస్తమా తీవ్రరూపం దాల్చుతుంది. ఇలాంటి సమయంలోనే ప్రతిఒక్కరిలోనూ తమలో ఉన్న అనారోగ్య సమస్యలు ఒక్కొక్కటిగా కూడా బయటకు వస్తుంటాయి. గాలి, నీటిలో క్రిమికీటకాల వ్యాప్తి ద్వారా కూడా వ్యాధులు వ్యాపిస్తుండటం సర్వ సాధారణంగా జరిగేదే. అయితే దగ్గు, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు చలికాలంలో అతిత్వరగా వ్యాప్తి చెందుతాయి. సైనస్ వంటి సమస్యలు ఉన్న వారు ఈ కాలంలో అత్యంత జాగ్రత్తగా మెలగటం ఉత్తమం. కీళ్ల నొప్పులు, చర్మవ్యాధుల సమస్యలు కూడా మామూలుగా ఉన్నవి తీవ్రంగా మారుతుంటాయి. పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వ్యాధి ముదరకముందే నిపుణులైన వైద్యుల సలహాలు తీసుకుంటే తద్వారా వాటిని సకాలంలో నియంత్రించటానికి అవకాశం ఉంటుంది. తీవ్రత పెరిగితే నియంత్రణకు కొంత సమయం పడుతుంది.

**పిల్లల నుంచి పెద్దల వరకూ**
ఆస్తమా వ్యాధి చిన్న పిల్లల నుంచి పెద్ద వారిలో వచ్చే శ్వాస సంబంధితమైన వ్యాధి. ప్రధానంగా ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల సమస్య. దీనికి మూలం అలర్జీ. మనం ముక్కుతో పీల్చుకునే గాలి శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తుల లోపలికి చేరుకుంటుంది. ఈ శ్వాసనాళం పై నుంచి రెండుగా చీలుతూ వచ్చి మళ్లీ చిన్న చిన్న గొట్టాలుగా విడిపోతూ..అతి సూక్ష్మమైన గాలి గదుల్లోకి చేరవేస్తుంది. సాధారణంగా దుమ్ము, ధూళి ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు దగ్గు వస్తుంది. ఇది హాని కారకాలు లోపలికి ప్రవేశించకుండా, వాటిని బయటకు నెట్టేయడానికి శరీరం చేసే ప్రయత్నమే. అయితే ఆస్తమా వచ్చే స్వభావం (అటోపీ) గల వారికి ఇలాంటి మామూలు విషయాలే పెద్ద సమస్యగా మారతాయి. దుమ్ము, ధూళి, పుప్పొడి, రసాయనాలు వంటివి తగిలినప్పుడు లోపల అలర్జీ ప్రేరేపితమై గాలిగొట్టాలు విపరీతంగా స్పందిస్తుంటాయి. అస్తమాకు మూలం ఇదే. గాలిగొట్టాలకు అలర్జీ కారకాలు తగిలినప్పుడు రోగనిరోధక కణాలు అతిగా స్పందిస్తాయి. దీంతో వాపు ప్రక్రియ (ఇన్ఫ్లమేషన్)మొదలవుతుంది. అప్పుడు గాలిగొట్టాల గోడలు ఉబ్బి, లోపలికి మార్గం సన్నబడుతుంది. గాలిగొట్టాల్లో జిగురుద్రవం ఉత్పత్తి పెరుగుతుంది. ఇది లోపలే చిక్కుకుపోతుంది. చుట్టుపక్కలా వాపు మాదిరి మార్పులు మొదలవుతాయి. దీంతో శ్వాసతీసుకోవటం, వదలటం కష్టమైపోతుంది. ఫలితంగా దగ్గు, పిల్లికూతలు, ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.

**రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది**
ఆస్తమా ఉన్న వారిలో ఆయాసం, దగ్గు బాగా ఇబ్బంది పెడతాయి. శీతాకాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల విటమిన్–డి తగ్గిపోతుంది. తద్వారా రోగ నిరోధక శక్తి పడిపోయి ఆస్తమా తీవ్ర రూపం దాల్చుతుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి 30 నుంచి 35 సంవత్సరాల పెద్దవారిలో కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. పిల్లల్లో వస్తే దానిని చైల్డ్ హుడ్ ఆన్సెట్ ఆస్తమా అని, పెద్దల్లో అయితే అడల్ట్ ఆన్సెట్ ఆస్తమాగా పిలుస్తుంటారు. న్యూమోనియా, జలుబు వంటివి కూడా ఎక్కువగా పీడిస్తుంటాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు తగ్గకుండా ముదిరితే ఆస్తమాకు దారితీస్తుంటుంది.

**ఆయుర్వేదంలో ఇలా తగ్గించుకోవచ్చు**
**హెర్బల్ టీ :** వాము, తులసి, మిరియాలు, అల్లం ఉపయోగించి కొన్ని హెర్బల్ టీలను తయారుచేసుకోవచ్చు. ఆస్తమా వ్యాధి నివారణకు ఇది దోహదపడుతుంది.

**వాసక :** ఇది ఒక శక్తివంతమైన భారతీయ మూలిక. ఇది ఉబ్బసం, బ్రోన్కైటిస్, అధిక శ్లేష్మ స్రావానికి చికిత్స చేస్తుంది. ఒక టీస్పూన్ వాసక రసాన్ని, రెండు టీ స్పూన్ల తేనెతో కలిపి రోజుకు రెండుసార్లు తీసుకోవచ్చు.

**యష్టిమధు :** యష్టిమధు అనేక ఆరోగ్య ప్రయోజనాలకు కల్గివుంది. ఉబ్బసం లక్షణాలకు ఉపశమనం చేస్తుంది. ఒక కప్పు యష్టిమధు టీ రోజుకు మూడు సార్లు తీసుకుంటే ఉబ్బసం సమస్యలు తగ్గుతాయి.

**మిరియాలు, తేనే మిశ్రమం :** ఆస్తమాతో ఇబ్బంది పడుతుంటే వెంటనే మిరియాలు, తేనె, ఉల్లిపాయరసం మిశ్రమాన్ని తీసుకోవాలి. ఇంకా ఎక్కువ ఇబ్బంది పడుతుంటే వెల్లుల్లి రెబ్బల రసాన్ని వేడి నీటిలో కలిపి తాగించటం మంచిది. ఈ మిశ్రమాన్ని భవిష్యత్తు అవసరాల కోసం కూడా సిద్ధం చేసుకుని ఉంచొచ్చు. వేడి నీటి కాపడం ద్వారా కూడా ఛాతీ కండరాలు వదులవుతాయి. సాధారణ శ్వాసను పునరుద్ధరించటంలో సహాయపడుతుంది.

**మంచి ఆహారం, జీవన శైలి ముఖ్యం :** ఆస్తమా ఉన్న రోగులకు మంచి ఆహారాన్ని అందించాలి. ఒత్తిడిలేని జీవితాన్ని గడపాలి. పేలవమైన జీర్ణక్రియ మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. అదనపు టాక్సిన్స్ నిర్మించబడతాయి. రోజంతా పుష్కలంగా నీటిని తాగటం వల్ల శ్లేష్మస్రావాలు, సన్నగా, వదులుగా ఉంటాయి. తద్వారా అవి వాయు మార్గాలను అడ్డుకోకుండా ఉంటాయి.

**రెగ్యులర్ థెరపీ :** క్రమం తప్పకుండా ఆందోళన, ఒత్తిడిని ఎదుర్కొనే వారికి థెరపీ సెషన్లు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఉబ్బసం ఉన్న వారికి శారీరక, మానసిక ఒత్తిడి తగ్గటానికి అవగాహన కల్పిస్తారు.

**వ్యాయామం చేయాలి :** ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయి. ఉబ్బసం ఉన్న వారికి ఈత చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

**ఇవి చేయాలి**
**ఆహారం :** తేలికగా అరిగే వేడిగా ఉండే ఆహార పదార్థాలను తినాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. తేనె, వెల్లుల్లి, పసుపు, మిరియాలు, అల్లం, పుదీనా, ఉసిరి వంటివి తరచుగా తీసుకుంటూ ఉండాలి. పాతబియ్యం, పెసలు, ఉలవలు, పొట్లకాయ వంటివి ఆహారంలో భాగమయ్యేలా చూసుకోవాలి. చలిలో బయటకు వెళ్లినప్పుడు చెవిలో దూది పెట్టుకోవాలి. పసుపు వేసిన వేడి నీటితో ఆవిరి పట్టాలి. అను తైలం లేక ఆవు నెయ్యిని రెండు చుక్కలు చొప్పున రెండు ముక్కు రంధ్రాల్లో వేయాలి.

**చేయకూడనివి**
- నిల్వ ఉన్న ఆహారపదార్థాలు తినరాదు
- చల్లటి పదార్థాలు, పానీయాలు సేవించొద్దు
- పెరుగు, అరటిపండు, బెండకాయ, కొబ్బరి, బంగాళదుంప, మైదా పిండి, శనగ పిండి, వేరుశెనగగుళ్లు, చేపలు, మినుములు, తీపి పదార్థాలకు దూరంగా ఉండటం మేలు

**రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడం కోసం**
అగస్త్య హరితకీ రసాయనం, చ్యవన ప్రాశ రసాయనం కుష్మాండ రసాయనం, దగ్గు ఉన్నప్పుడు హరిద్రాఖాండా, తాళిసాధి చూర్ణం, మొదలైనవి తీసుకోవాలి. శీతోసలాడి చూర్ణం, సీతాఫలాల చూర్ణం మొదలైనవి వ్యాధి తీవ్రను తగ్గించటానికి దోహదపడతాయి.

## వైద్య సిబ్బంది గైర్హాజరుపై చర్యలు: డిఎంహెచ్ఓ



**భీమదేవరపల్లి నవంబర్ 27 (నినాదం న్యూస్):**
జిల్లాలోని వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలను త్వరలో సర్దుబాటు చేస్తామని హనుమకొండ డిఎంహెచ్ఓ అల్లం అప్పయ్య తెలిపారు. ఇటీవల జిల్లా వైద్యాధికారిగా భాధ్యతలు తీసుకున్న ఆయన బుధవారం భీమదేవరపల్లి మండలం ములుకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఎప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. మండలంలో వంగర, ములుకనూరు ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, వాటి ఆరోగ్య సేవల విస్తరణకు కృషి చేస్తామన్నారు. సిబ్బంది గైర్హాజరుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.ప్రదీప్, డా. మౌనిక ఇతర సిబ్బంది ఉన్నారు.

# ఓ అమ్మ సుదీర్ఘ న్యాయ పోరాటం!

**హైదరాబాద్, నవంబర్ 27 (నినాదం న్యూస్)**

ఇది ఒక యథార్థ సంఘటన.. బిడ్డ ఆనవాళ్ల కోసం 18 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన ఓ తల్లి కథ.. ఆ బిడ్డకి ఏమైంది.. ఆ తల్లి ఏం చేసింది.. తెలుసుకుంటుంటే ఆద్యంతం ఉత్కంఠ రేగుతుంది. ఓ మర్డర్ మిస్టరీ సినిమాలో వచ్చే మలుపులు, ఎత్తులు ఈ పేదతల్లి తన జీవితంలో చూసింది. బిడ్డ లేదన్న చేదు నిజాన్ని పంటిబిగువున బిగబట్టి ఏళ్లకు ఏళ్లు న్యాయం కోసం ఎదురుచూసింది. చివరికి 2024 నవంబరు 11న ఆ తల్లి నిరీక్షణకు తెరపడింది. పొత్తిళ్ల బిడ్డని తన అరచేతుల్లో ఆడించిన ఆ తల్లే.. ఆ రోజు తన కూతురు అస్థికలని ఒడిలోకి తీసుకుని బోరున ఏడ్చింది. ఆ క్షణం ఆమె గెలిచినట్లా.. ఓడినట్లా.. అసలు ఏం జరిగింది?

నవంబరు 11న కేరళ కసర్‌గూడ కోర్టు ప్రాంగణం ఒకటే హడావిడిగా ఉంది. మీడియా అంతా అక్కడే ఉంది. మధ్యాహ్నం 2 గంటలకు బిక్కపల్చని ఇద్దరు వృద్ధ దంపతులు మొయిత్తు, ఆసిఫా లీగల్ కౌన్సిల్ దగ్గర వేచిచూస్తున్నారు. అవసరమైన పేపర్ వర్క్ పూర్తి చేశారు. కోర్టు నుంచి వారికి ఒక పార్శిల్ వచ్చింది. అందులో ఉన్న వస్తువు ఆ పెట్టె బరువు కంటే తక్కువగా ఉన్నట్లు ఉంది. వాళ్లిద్దరూ ఎంతో ఆతృతగా పెట్టెని తెరిచారు. అందులో ఓ తెల్లని వస్త్రంలో చుట్టిన చిన్నపిల్ల పుర్రె ఉంది. అది చూసిన ఆసిఫా గుండెలు బాదుకుంటూ నెత్తినోరు కొట్టుకుంటూ బిగ్గరగా ఏడ్చింది. ఆ పుర్రెని చేతుల్లో తీసుకున్న మొయిత్తూ 'తల్లీ ఇప్పటికి నా దగ్గరకి వచ్చావా?' అని హత్తుకున్న దృశ్యం, అక్కడున్న వాళ్లందరినీ కళ్లనీళ్ల పర్యంతం చేసింది. **ఈ విషాధ గాథ ఇక్కడి నుండే మొదలుపెట్టాలి..**

చదివిస్తామన్నారు. మొయిత్తు కుటుంబం కాసర్‌గూడలో నివసిస్తోంది. దినసరి కూలీ చేసి కుటుంబాన్ని పోషించేవాడు. చాలీచాలని సంపాదనతో బిడ్డలకి తిండి పెట్టడమే కష్టమయ్యేది. అలాంటి పరిస్థితుల్లో పొరుగింటి నుంచి ఓ ప్రతిపాదన అతని ఇంటికి వచ్చింది. కర్నాటక, గోవాలో వ్యాపారం చేస్తున్న తమ ఇంట్లో చిన్న పిల్లలని చూసేందుకు ఓ కేర్‌టేకర్ కావాలని, మొయిత్తు కూతురు సాఫియాని తమతో పంపించమని హంస, మైమూనా దంపతులు కోరారు. దానికి మొయిత్తు దంపతులు అంగీకరించలేదు, ఆ పేదతండ్రిని ఎలాగైనా ఒప్పించాలన్న లక్ష్యం ఉన్న హంస, తమతో పంపిస్తే, సాఫియాకి చదువు కూడా చెప్పిస్తామని నమ్మబలికాడు. ఈసారి మొయిత్తు ఏ అభ్యంతరం చెప్పలేదు. అలా 18 ఏళ్ల క్రితం, 2006లో 13 ఏళ్ల సాఫియా ఇంటి నుండి బయటికి వెళ్లింది.

**బిడ్డ కోసం ఎంతో తపించింది..**

అక్కడికి వెళ్లినదగ్గర నుంచి సాఫియా తల్లిదండ్రులతో స్వేచ్ఛగా మాట్లాడేది కాదు. బిడ్డ గుర్తుకు వచ్చినప్పుడల్లా తనని చూసేందుకు వెళ్లాలంటే దారి ఖర్చులు కూడా మొయిత్తు దగ్గర వుండేవి కావు. ఈ పరిస్థితుల్లో బిడ్డపై ఉన్న కొండంత ప్రేమని గుండెల్లోనే దాచుకుని ఆ దంపతులు కాలం వెల్లదీశారు. అక్కడ.. హంస చేసిన వాగ్దానాలేవీ అమలు చేయలేదు. బడికి పంపలేదు. చిన్నారి సాఫియాతో ఇంటి చాకిరీ చేయించేవారు. కర్నాటక నుంచి గోవాకి మకాం మార్చారు. ఈ విషయం కూడా మొయిత్తుకి చెప్పలేదు. తన కూతుర్ని




ఇంటికి పంపించేయమని ఆసిఫా ఎన్నోసార్లు బతిమాలేది. కానీ, వారు పట్టించుకోలేదు. బిడ్డ మీద దిగులుతో ఆ తల్లి భారంగా రోజులు గడిపింది.

**పారిపోయిందని చెప్పారు..**

2006 డిసెంబరు 20న హంస నుంచి మొయిత్తుకి ఫోన్ వచ్చింది. తన సొంత నివాసం కాసర్‌గూడకి వచ్చి సాఫియాని తీసుకెళ్లమని దాని సారాంశం. సాఫియాని చూస్తానన్న కొండంత ఆశతో మొయిత్తు పయనమయ్యాడు. కానీ అక్కడ..

సాఫియా లేదు. బిడ్డని ఆడిస్తానని వెళ్లిన తను ఆ రోజే కనిపించకుండా పోయిందని హంస చెప్పాడు. మొయిత్తు ఇది ఊహించలేదు. ఊరంతా వెతుకుదామని హంస తనతో తీసుకెళ్లాడు. అయినా తన జాడ లేదు. చీకటిపడిన తరువాత మిస్సింగ్ కేసు ఫైల్ చేద్దామని పోలీసు స్టేషనుకి తీసుకెళ్లాడు. అసలు ఏం జరుగుతుందో అర్థం కాని అయోమయ స్థితిలోనే మొయితీ కంప్లైంట్ ఫారం పూర్తి చేసి, ఒట్టి చేతుల్తో ఇంటికి చేరుకున్నాడు.

**మొయితుని జైల్లో వేశారు**

ఈ విషయాలేవీ మొయిత్తు, ఆయేషాకి చెప్పలేదు. బిడ్డ క్షేమంగా ఉందని నమ్మబలికాడు. రెండు రోజుల తరువాత పోలీస్ స్టేషను నుంచి మొయిత్తు దంపతులకు సమన్లు వచ్చాయి. హంస అక్కడే ఉన్నాడు. బిడ్డని మొయిత్తునే దాచి, డబ్బుల కోసం తనపై ఫాల్స్ కంప్లైంట్ పెట్టాడని హంస ఆరోపించాడు. పోలీసులు మొయిత్తుని జైల్లో వేశారు. చంకలో చంటి బిడ్డని వేసుకుని పోలీసుస్టేషనుకి వెళ్లిన ఆయేషాకి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఏడుస్తూనే ఉంది. కొన్ని రోజులకు పోలీసులు మొయిత్తుని విడుదల చేశారు. అయితే ఈసారి ఆయేషా మౌనంగా కూర్చోలేదు. తన కూతురు ఏమైంది? ఎక్కడికెళ్లింది? హంస ఏం చేశాడు? తెలుసుకోవాలనుకుంది. స్థానిక కౌన్సిల్‌ని సంప్రదించింది. కొంతమంది సామాజిక కార్యకర్తలు కూడా ఆమెతో కలసివచ్చారు. సాఫియా మిస్సింగ్ కేసును సీరియస్‌గా విచారించేలా పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారు.

**120 రోజుల నిరాహార దీక్ష**

వందలమంది ఏకమై 120 రోజుల పాటు సత్యాగ్రహం చేశారు. ఈ నిరసన దీక్షలో కాసర్‌గూడ బయట నుంచి కూడా చాలామంది పాల్గొన్నారు. క్రైమ్ బ్రాంచ్ జోక్యం చేసుకోవాలన్న వాళ్ల డిమాండ్‌కి అధికారులు తలొంచారు. ఈ మొత్తం నిరసనలో ఆయేషా పడిన తపన గురించి నిరసనకారుడు సుబేయిర్ ఇలా చెబుతాడు : 'ఇన్ని రోజులు.. ఇంతమందిమి నిరసనలో పాల్గొన్నామంటే, మా వెనుక ఆయేషా అనే బలమైన పట్టుదల ఉంది'.

**ముక్కలు ముక్కలు చేశారు**

2015 జులై 16న సాఫియాని దారుణంగా హత్య చేసినందుకు హంసకి ఉరిశిక్ష పడింది. కేసు విచారణలో భయంకర నిజాలు వెలుగుచూశాయి. సాఫియా కనిపించకుండా పోయిందని హంస చెప్పిన ఐదు రోజులకు ముందే తను దారుణంగా హత్యకు గురైంది. ఆ రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటగదిలో ఉన్న సాఫియాపై హంస పొరబాటున వేడినీళ్ల పోశాడు. ఆ వేడికి తన ఒళ్లంతా కాలిపోయింది. మైనర్‌ని పనిలో పెట్టుకున్నారని కేసు పెట్టారన్న భయంతో హాస్పటల్‌కి తీసుకెళ్లలేదు. వేరే అపార్ట్‌మెంట్‌కి మార్చాడు. అక్కడ ఓ పదునైన కత్తితో ఆమె చనిపోయేదాకా మెడపై గాయాలు చేశాడు. శరీరాన్ని ముక్కలుముక్కలుగా నరికాడు. సంచుల్లో వేసుకుని గోవా, బెల్గాం జాతీయ రహదారి వైపు కారులో తీసుకెళ్లాడు. ఈ మొత్తం వ్యవహారంలో హంస స్నేహితులు కూడా అతనికి సహాయం చేశారు. దూరంగా అడవిలో పారేశారు. అయితే తమను ఎవరో చూశారన్న అనుమానంతో ఆ సంచులని మళ్లీ వెనక్కి తీసుకువచ్చి స్నేహితుడి సొంత స్థలంలో పాతిపెట్టారు.

**నిందితులంతా బయటే ఉన్నారు**

పక్కా ప్రణాళికతో ఈ మొత్తం వ్యవహారాన్ని హంస నడిపించాడు. పోలీసులను ప్రలోభపెట్టాడు. గోవా నుంచి కాసర్‌గూడకి సాఫియా వచ్చినట్లు మొయిత్తుకి చెప్పించాడు. సాఫియా మిస్సింగు వెనుక ప్రేమ వ్యవహారం ఉందని ప్రచారం చేశాడు. ఇంత దారుణం చేసిన హంస ఇప్పుడు ఉరిశిక్ష నుంచి బయటపడి జీవితఖైదుని అనుభవిస్తున్నాడు. అతనికి సహాయం చేసిన భార్య, స్నేహితులు మూడేళ్ల శిక్ష అనుభవించి బయటికి వచ్చేశారు.

క్రైమ్ బ్రాంచ్ పరిశోధనలో వెలుగుచూసిన ఈ భయంకర నిజాలకు ఆయేషా గుండె బద్దలైంది. పాతిన చోట ఆయేషా ఆనవాళ్లుగా ఆమె ఎముకలే మిగిలాయి. 'ఈ ఘోరం ఎవరికీ జరగకూడదు. అందుకే నేను ఈ పోరాటం చేశాను. నాకు కలిగిన ఈ నష్టం ఎవ్వరూ పూడ్చలేరు. నా బిడ్డని కలుసుకోలేకపోయాను. కనీసం మా మతాచారం ప్రకారం ఆమెకి సంబంధించినవి ఏవైనా మాకు అప్పగించండని అభ్యర్థించాను. ఇదిగో నా కూతురుని ఇలా అప్పజెప్పారు' అని ఆయేషా బిగ్గరగా రోదిస్తున్న చోటుకి కాస్త దూరంగా ఆమె 120 రోజులు నిరాహార దీక్ష చేసినప్పుడు సాక్ష్యంగా నిలిచిన పచ్చని 'సిగ్నేచర్ ట్రీ' (సంతకాల చెట్టు) మోడై తన విచారాన్ని వ్యక్తం చేసింది. **(2022లో రోడ్డు విస్తరణలో భాగంగా కాసర్‌గూడ బస్టాండుకు ఆనుకుని వున్న సిగ్నేచర్ ట్రీని తొలగించారు)**

# మహిళలకు ఇల్లే నరకం!



**హైదరాబాద్, నవంబర్ 27 (నినాదం న్యూస్)**

ఈ భూగోళం మీద మహిళలకు. బాలికలకు అత్యంత ప్రాణాంతకమైన ప్రదేశం ఏదైనా వున్నదీ అంటే అది వారి ఇల్లే అని ఐరాస అనుబంధ సంస్థలు పేర్కొన్నాయి. గతేడాది సగటున రోజుకు 140మంది మహిళలు, బాలికలు వారి భాగస్వాముల లేదా బంధువుల చేతుల్లో మరణించారని ఈ ప్రపంచ సంస్థకు చెందిన రెండు సంస్థలు వివరించాయి. . 2023 ఒక్క ఏడాదిలోనే దాదాపు 51,300మంది మహిళలు ఈ విధంగా హత్యకు గురయ్యారని యుఎన్ వుమెన్, యుఎన్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్ అనే సంస్థలు తమ నివేదికలో వెల్లడించాయి. 2022లో ఈ సంఖ్య 48,800గా వుంది. దేశాల నుండి మరింతగా డేటా అందుబాటులోకి రావడం వల్ల పెరిగిందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా మహిళలపై హింస నిర్మూలనా దినోత్సవమైన సోమవారం ఈ నివేదిక వెలువడింది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు ప్రతి చోటా ఏదో ఒక రూపంలో లైంగిక హింసకు గురవుతునే వున్నారని ఆ రెండు సంస్థలు నొక్కి చెప్పాయి. దీనికి ఏ ప్రాంతమూ మినహాయింపు కాదని పేర్కొన్నాయి. పైపెచ్చు మహిళలకు వారు నివసించే ఇల్లే అత్యంత ప్రమాదకరమైన స్థలంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ హత్యలు అధికంగా ఆఫ్రికాలో చోటు చేసుకున్నాయి. 2023లో 21,700మంది హత్య చేయబడ్డారని అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. ప్రతి లక్ష మందికి 2.9మంది బాధితులు వున్నారని తెలిపింది. గతేడాది అమెరికాలోను ఈ మరణాల రేటు ఎక్కువగానే వుంది. పశ్చిమ దేశాలతో పోల్చితే ఆసియా దేశాల్లో ఈ నేరాలు తక్కువే. ప్రతి లక్షమందిలో 0.8మంది బాధితులు నమోదయ్యారు. యూరప్‌లో ఈ సంఖ్య 0.6గా వుంది. ఇందుకు పూర్తి విరుద్ధంగా ఇంటికి వెలుపల, కుటుంబాలకు బయట పురుషుల హత్యలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. 2023లో జరిగిన హత్యల్లో 80శాతం మంది పురుషులు కాగా 20శాతం మంది మహిళలు. అయితే కుటుంబాల పరిధిలో ప్రాణాంతకమైన హింస ప్రధానంగా మహిళలపైనే జరుగుతోంది. ఈ హత్యలను నివారించేందుకు ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నప్పటికీ హత్యలు ఇంకా ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది. తరచుగా ఈ హత్యలు ఈ లింగ ఆధారిత హింసకు పరాకాష్టగా వుంటాయని, వీటిని సకాలంలో, సమర్ధవంతమైన రీతిలో జోక్యం చేసుకోవడం ద్వారా నివారించవచ్చని ఆ నివేదికలో ఐక్యరాజ్య సమితి సంస్థలు పేర్కొన్నాయి.

# కలివిడిగా .. సందడిగా వనభోజనాలు

**హైదరాబాద్, నవంబర్ 27 (నినాదం న్యూస్)**

చుట్టూ పరిసరాలు, వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉండే కాలం ఇది. ఎక్కడ చూసినా పచ్చదనం పలకరిస్తూ ఉంటుంది. ఏరులూ, సెలయేర్లూ గలగలమని పారుతూ ఉంటాయి. ఈ తరుణంలో సమూహాలుగా, సందడి సందడిగా వనాలకు తరలివెళ్లి, అక్కడ ఉమ్మడి భోజనాలతో ఆనందంగా గడపటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. మనుషుల మధ్య మరింత స్నేహ సంబంధాలూ, ఆప్యాయతానుబంధాలూ వర్ధిల్లటానికి వనభోజనాలు దోహదపడతాయి. బిజీ బిజీ జీవితాల ఉరుకులు పరుగులకు భిన్నంగా ఆటపాటలతో, ఆనంద సందోహాలతో గడపటానికి పిక్నిక్కులు కేరాఫ్ అడ్రసులుగా అలరారుతున్నాయి.

ఏటేటా స్నేహపూరిత వాతావరణాన్ని చేరువచేసే మహత్తర ఘట్టమే వనభోజనం. ఇక్కడ అప్యాయమైన పలకరింపులు%ా%కలగొలుపు కేరింతలు%ా% ఆనందాల హరివిల్లులు సర్వసాధారణం. ఒకరిపై ఒకరికి మమకారాన్ని పంచే అద్వితీయమైన ఆ క్షణాలను వెలకట్టగలమా? వనభోజన సమయం ఆసన్నమైన ఈ వేళ ఒక్కసారి మనకూ ఆ క్షణాలను ఆస్వాదించేద్దాం రండి.

విహారం, వినోదం, ఆనందం, ఆహారం, ఆరోగ్యం, సామరస్యం, సమైక్యత, పరస్పర సహకార భావనలకు కేంద్రం వనభోజనం. ఇవన్నీ ఒకేచోట సమకూరే ఏకైక వేదుక వనభోజన కేంద్రంలోనే. కార్తీక మాసం అంటే పిక్నిక్‌ల సీజన్. ఈ కాలంలో చాలామంది వనభోజనాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు.

ప్రకృతితో మన బాంధవ్యాన్ని పెంపొందించేదే వనభోజనం. సెలవురోజుల్లో ఈ పిక్నిక్‌ల హడావుడి మరింతగా ఎక్కువగా ఉంటోంది. ఉదయం ఇంటి నుంచి బయలు దేరే దగ్గర నుంచి ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చే వరకూ అందరూ సమన్వయంతో పనిచేయటం. పనుల్లో భాగస్వామ్యం కావటం, ఆత్మీయ పలకరింపులు, పరస్పర సహకారం ఆద్యంతం ఇక్కడ సాక్షాత్కరిస్తుంటుంది. అంతకుముందు ఒకే అపార్టుమెంటులోనో, ఒకే వీధి, ఒకే కాలనీల్లో, ఊర్లు, పట్టణాల్లో ఉండేవారు పిక్నిక్‌లో సరదాగా కలిసి హాయిగా మంచీ చెడు గురించి మాట్లాడుకుంటుంటారు. అప్పటివరకూ నెలలతరబడి మాట్లాడుకోవటానికి వీల్లేని వారు కూడా ఈ వన సమారాధనల్లో చక్కగా ముచ్చడించుకోవటంతో సంతోషపడుతుంటారు. మరికొందరు స్నేహితులు, బంధువులు ఇలా బృందాలుగా వెళ్లి వన భోజనాలు చేస్తున్నారు. ఇంకొందరు కులాలవారీగా కూడా జరుగుతున్నాయి. ఇలా కులాలవారీగా విభజించబడితే సమాజంలో అసమానతలు, అభద్రతాభావాలు వంటివి కొనసాగుతుంటాయి. అందుకే అందరూ కులమతాలకు అతీతంగా సమైక్యతా భావంతో పిక్నిక్‌లు జరుపుకోవటం సముచితం.





**పిక్నిక్‌కు వెళ్లేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించండి**

పిక్నిక్‌కు వెళ్లినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యంత జాగ్రత్తగా ఉండగలిగితే ఆహ్లాదం కోసం చేసే వనవిహారయాత్రలు విషాదాంతం కాకుండా మంచి జ్ఞాపకంగా మిగులుతాయి.

**సముద్రాల వద్ద :** రాష్ట్రంలోని సుదీర్ఘమైన సముద్రతీరంలో ఎక్కడ చూసినా కార్తీక మాసం పిక్నిక్ స్పాట్‌లే కనిపిస్తుంటాయి. బీచ్‌లలో సందర్శకులు గల్లంతవుతున్న ఉదంతాలు చూస్తూనే ఉంటున్నాం. సముద్ర స్నానాలు చేసేటప్పుడు అత్యుత్సాహంగా లోతుకు వెళ్లకూడదు. పోలీసుల హెచ్చరికలు పాటించాలి.

**జలపాతాలు :** జలపాతాల వద్ద నాచుపట్టి జారిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదకరంగా ఉండే ప్రాంతాలకు వెళ్లకూడదు. ఆహ్లాదాన్ని ఆస్వాదించాలే కాని అత్యుత్సాహానికి దిగి ప్రమాదాల బారినపడకూడదు.

**నదులు :** నదులు, చెరువులు, కాలువల్లో స్నానాలకు దిగకూడదు. స్నానఘట్టాలు ఉన్నచోట్ల కూడా మెట్లు దెబ్బతిని ముందుకు పడిపోయే ప్రమాదం ఉంటుంది. హెచ్చరిక బోర్డులను గమనించి నీటిలో దిగటం ఉత్తమం. ప్రతిచోటా ఉన్న హెచ్చరిక బోర్డుల సందేశాన్ని కచ్చితంగా పాటించాలి. సరదా పేరిట సాహసాలకు దిగరాదు.

**ఆకతాయితనం వద్దు :** వన సమారాధనకు చెట్లు, పుట్టలు ఎక్కువగా ఉన్న చోట్లకు వెళ్లేందుకు ప్రాధాన్యత ఇస్తారు. చెట్లు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా తేనెపట్టులు ఉంటాయి. వాటిపై పిల్లలు, ఆకతాయితనం ఉన్న వారు రాళ్లు వేస్తే తేనెటీగలు దాడిచేస్తుంటాయి. విషసర్పాల ప్రమాదం కూడా పొంచివుంటుంది. వాటికి ఆవాసంగా ఉన్న పొదలు, పుట్టలు ఉన్న చోట్లకు దూరంగా ఉండటం మంచిది.

**ఇంకా..**

వన భోజన సమయంలో పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలి. వారు దూరంగా వెళ్లకుండా చూసుకోవాలి

వెళ్లే వాహనాలు కండిషన్‌లో ఉన్నాయో లేదో ముందు చూసుకోవాలి

సరిపడా మంచినీరు, ఆహార పదార్థాలను తీసుకెళ్లాలి. పిల్లలకు, వృద్ధులకు ఆహారం ఆలస్యం కాకుండా అందించాలి.

**వెళ్లిన ప్రదేశానికే పరిమితమైతేనే మంచిది**

ఏ తిండి పదార్థాలు, ఇతరత్రా తగినన్ని లేకపోతే అప్పటికప్పుడు అమర్చుకోగలిగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందే చేసుకోవాలి.

అన్ని వయసుల వారికి ఆటపాటలు ఏర్పాటు చేయాలి. ఎవరిలో ఏ టాలెంటు ఉందో అప్పుడే బయటపడుతుంది.

విజేతలు అయినవారికే కాకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్త తీసుకోవాలి. నిర్వాహకులు ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ మాట్లాడాలి.

# స్త్రీ చైతన్య ప్రతీక గురజాడ 'కన్యక'

**హైదరాబాద్, నవంబర్ 27 (నినాదం న్యూస్)**



మౌఖిక సాహిత్యంగా తెలుగు ప్రజల్లో విస్తృత ప్రచారం పొందిన వైశ్య కుల దేవత కన్యకా పరమేశ్వరి కథ గురజాడ కన్యకకి మూలమని ప్రచారంలో ఉన్నా, రెండు కథలకీ సారూప్యం చాలా తక్కువ. వైశ్య కులానికి చెందిన బాలిక కన్యక పాత్రని ఆధారంగా చేసుకుని సామాజిక నీతిని ఆవిష్కరించడం గురజాడ చేసిన ప్రయత్నంబీ ఆ ప్రయత్నం బలీయమైనది కాబట్టే 'కన్యక'కి 112 సంవత్సరాల వయసు వచ్చినా స్త్రీ చైతన్య ప్రతీక అయిన ఒక కథా కావ్యంగా నిలుస్తోంది. కథలో కన్యక వయసు గురజాడ చెప్పకపోయినా కథాకాలం నాటి పరిస్థితుల దష్ట్యా, ఆ రోజుల్లో యుక్త వయసు వచ్చిన ఆడపిల్లలు చెలికత్తెలతో కలిసి బయటకు వచ్చేవారు కాదు కాబట్టి, ఆమె బాలిక అని అనుకోవచ్చు. కన్యక కథ స్థూలంగా పరికిస్తే – ఒక రోజు కన్యక చెలికత్తెలతో కలిసి గుడికి వెడుతో ఉంటుంది. అటుగా వస్తున్న ఆ పట్టణాన్ని ఏలే రాజు కన్యకని చూసి, ఆమె సౌందర్యానికి ముగ్ధుడై మోహించి తనతో వచ్చిన మంత్రులతో కలిసి ఆమెని చుట్టుముట్టి చెరపట్టే ప్రయత్నం చేస్తాడు. నిస్సహాయ స్థితి స్ఫురకొచ్చి, సమయస్ఫూర్తితో 'కోవెలకి వెళ్ళి దేవకార్యం తీర్చి వస్తానుబీ వైశ్య కన్యను, నిన్ను తప్పించుకుని ఎక్కడకి పోతాను' అని అంటుంది కన్యక. ఆ తరవాత కన్యక తండ్రి రాజుతో మాట్లాడుతూ– తన కూతురు రాజు సొత్తే కదా అని పలికి రాజుని శాంతింపచేసే ప్రయత్నం చేస్తూ, కులధర్మం ప్రకారం అగ్ని సాక్షిగా కన్యకని పొంది తమ వాళ్ళని ఆదరించమని అభ్యర్థిస్తాడు. దానికి రాజు తాను చెప్పినదే ధర్మం అని, తాను తలచుకుంటే గాంధర్వ చేసుకోగలను కదా అని బదులిస్తాడు. ఈ రోజు, రేపు అని గడువు పెట్టకుండా పిల్లని ఇస్తే ఇయ్యి, లేకుంటే పో అని గదమాయిస్తాడు రాజు. 'ముందు దైవ కార్యం, తరవాత కదా రాచకార్యం, మా ఇంటి కులదైవం అయిన వీరభద్రుడి గుడికి ఇప్పుడే వెళ్ళి దైవకార్యం నిర్వహించి వస్తాను' అని అంటాడు కన్యక తండ్రి. "సరే, నేను కూడా వస్తాను, గుడిలోనే అగ్నిసాక్షిగా కన్యకను స్వీకరిస్తాను" అని రాజు కన్యక కుటుంబంతో సహా గుడికి వెడతాడు. అక్కడ కన్యక తన కుటుంబాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో ఉపదేశాలు, ఉద్బోధలూ చేస్తుంది. ఆ తరవాత "సువ్వే కనక రాజువైతే నన్ను పట్టుకో" అంటూ సవాలు విసిరి మంటల్లోకి దూకి ఆత్మాహుతి చేసుకుంటుంది.

కేవలం కథ పరంగా చూస్తే పెద్దగా సంచలనం ఏమీ కనపడదు. సమాజంలో బలవంతుడైన ఒక దుష్టుడు చెరపడుతూంటే తల్లొగ్గలేక ఒక ఆడపిల్ల అగ్నికి ఆహుతి అవుతుంది. అది కథ సారం, ముగింపు. గురజాడ రాసిన కన్యక ఖండిక పైకి కనిపించే కథని మించిన సందేశాన్ని తెలుపుతుంది. రాజుకి, కన్యకకి మధ్య జరిగిన తొలి సంభాషణ తరవాత కథాగమనంలో కొంచె అస్పష్టత ఉంది. రాజుకి, కన్యకకి మధ్య జరిగిన సంభాషణకి సంబంధించిన వాక్యాల తరవాత వెంటనే అర్థాంతరంగా కన్యక తండ్రికి, రాజుకి మధ్య సంభాషణ మొదలవుతుంది. ఇది గురజాడ కథాగమనంలో ప్రదర్శించిన శైలిలో భాగమా లేక, ఆయన రాసిన కవిత మూలంలో మనకి లభ్యం కాని చరణాలు ఉన్నాయా అన్నది పరిశోధించాలి. చెలామణీలో ఉన్న ప్రతి ప్రకారం చూస్తే కథ వేర్వేరు రోజుల్లో జరిగిందని అనుకోవాలి. ఈ కవితలో రాజు పేరుగానీ, కన్యక తండ్రి పేరుగానీ ప్రస్తావించదు గురజాడ. కథ కన్యక ప్రధానంగానే నడుస్తుంది, ముగుస్తుంది. మెటిల్డా లాంటి కథలో కూడా అన్ని పాత్రలకీ పేరు పెట్టకుండా కథని రసవత్తరంగా నడిపిస్తాడు గురజాడ. అది గురజాడ కథకి, కథనానికి, కాలానికి ఉన్న బలం.

**కన్యక – పూర్ణమ్మ : సారూప్యత :** బాలికల జీవితం ఆధారంగా గురజాడ రాసిన పూర్ణమ్మ, కన్యక ఖండికల్లో పెక్కు సారూప్యతలు కనిపిస్తాయి. రెండు కవితల్లోనూ బలవంతపు వివాహం నచ్చని ఆత్మగౌరవం గల బాలికలు నిరసనతో తనువు చాలిస్తారు. ఇద్దరు నాయికలూ తమ కాలానికి అతీతమైన తెగువ, సమయస్ఫూర్తి, వివేకం, పరిణతి కలిగి ఉంటారు. యువతుల్లో ఈ గుణాలు ఉండాలన్న ఆకాంక్షవల్ల కావచ్చు కన్యక, పూర్ణమ్మ పాత్రలను సృష్టించాడు గురజాడ.


కథ జరిగిన ప్రాంతాలకి, కవితల్లోని వర్ణనలకి కూడా రెండు కథలలోనూ పోలిక కనిపిస్తుంది. ఇద్దరు నాయికలూ కొలిచే దేవత దుర్గగానూ, వారు దర్శించే కోవెల ప్రాంగణంలో ఉండే కొలను, అందులోని కలువలు రెండు కవితల్లోనూ పోలిక కలిగి ఉంటాయి. ఈ రెండు కవితల్లోనూ ప్రస్తావించిన దుర్గ, శక్తి, స్త్రీ శక్తికి ప్రతీకాత్మక రూపాలుగా గురజాడ సృష్టించాడని అనుకోవచ్చు. తాను సందర్శించిన ప్రాంతాల్లో తాను సందర్శించిన దేవాలయాలను ఈ కవితల్లో చిత్రించే ప్రయత్నం చేశాడా గురజాడీ పరిశోధకులు తేల్చవలసిన అంశం ఇది.

కథ పరంగా చూస్తే, పూర్ణమ్మ ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోతుంది. వెనక్కి తిరిగి రాదు. పూర్ణమ్మ దుర్గను చేరిందని రాయడంద్వారా, ధ్వనిప్రాయంగా ఆమె ఆత్మాహుతి చేసుకుందని చదువరులు ఊహించేలా చెబుతాడు. బలవంతంగా పెళ్లి చేసుకోవాలన్న రాజు కోరికని తీర్చలేక అగ్నికి ఆహుతి అయిందని కథలో నేరుగా చెబుతాడు గురజాడ. రాజుని నేరుగా ఎదుర్కునేటప్పుడు పారిపోయే అవకాశం లేదు కాబట్టి గుళ్ళో జరుగుతున్న తంతులో అగ్నికి ఆహుతి అవడమే శరణ్యం కన్యకకి. అంతేగాక, "సువ్వొక రాజువైతే, నన్నిపుడు పట్టుకో" అని సవాలు విసిరి అగ్నిలో దూకుతుంది కన్యక. ఎంత రాజయినా, కామంతో దహించుకుపోతున్నా, కన్య అగ్నిలో దూకుతోంటే ఆమెని కాపాడే ధైర్యం లేని అసమర్థుడిగా చిత్రించడానికి అవసరమైన సన్నివేశం కల్పించి కవిగానే కాకుండా, ఒక దర్శకుడిలా ఆలోచించాడు గురజాడ.

**గురజాడ సందేశం :** కన్యక పాత్ర ద్వారా గురజాడ విస్తృత సమాజానికి గురజాడ ఇచ్చిన సందేశం బలీయమైనది. "సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే డబ్బు, ఆస్తి ఉంటే చాలదు. చదువు, ధైర్యం, బుద్ధిబలం, అన్యాయాన్ని ఎదిరించడానికి, అవసరమైతే పోరాడడానికి భుజబలం, కలిగి ఉండాలి. అప్పుడే పాలకులకు ధీటుగా ఎదగగలరు" అన్న సామాజిక సత్యాన్ని 112 సంవత్సరాల క్రితం దుర్భల స్థితిలో ఉన్న ఒక బాలిక పాత్రద్వారా చెప్పిస్తాడు దార్శనికుడైన గురజాడ. మన బతుకు దెబ్బతినకుండా సాగాలంటే తలదించుకుని బతకాలనే మనస్తత్వం సమాజ శ్రేయస్సుకు, వ్యక్తి జీవిత గమనానికి అవరోధమని పరోక్షంగానైనా కన్యక పాత్ర ద్వారా బలంగా చెప్పాడు గురజాడ.

కన్యక ఖండిక నడచిన తీరు ఒక ఎత్తైతే, ప్రతీకాత్మకంగా రాసిన ఉపసంహారం మరో ఎత్తు. ప్రజలని నియమ, నిబద్ధతలతో ఏలవలసిన రాజు ప్రజాకంటకుడిగా మారితే ఏమవుతుందో కన్యక కవితకి ఉపసంహారం ద్వారా చెప్పాడు గురజాడ. "రాజు గర్వం మట్టిగలిసిందిబీ రాజు పతనానికి ప్రతీకగా కోట, పేటలు కూలి రాజ్యం నక్కలపాలయింది. ఎక్కడైతే కన్యక మానం కాపాడుకోవడం కోసం మంట కలిసిందో అక్కడ ఎత్తైన భవనం ఆవిర్భవించింది" అని చెప్పడం ద్వారా పాలకులు, రాజ్యాలు శాశ్వతం కాదని, వారు చేసే పని వల్ల మాత్రమే వారికి చరిత్రలో స్థానం ఉంటుందని, ఏనాటి పాలకులకైనా వర్తించేలా బోధనాత్మక సందేశం ఇచ్చాడు గురజాడ. కవులు, రచయితలు సమాజంలో జరిగే అమానుషాలని, అకృత్యాలని తమ రచనల ద్వారా ఎత్తిచూపాలని ధ్వనిప్రాయంగా చెప్పాడు.

# అనంతగిరిలో గ్రంథాలయం కరువు ..



- ప్రిపేర్ అయ్యేందుకు ఇక్కట్లు
- కోదాడ పట్టణానికి వెళ్లాల్సి వస్తుందంటున్నా నిరుద్యోగులు..
- గ్రంథాలయ ఏర్పాటుకై పెరుగుతున్న డిమాండ్...

**కోదాడ, నవంబర్ 27(నినాదం న్యూస్):** జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన మండలాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2016 వ సంవత్సరంలో ఏర్పడిన అనంతగిరి మండలం ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశారు. అన్ని శాఖలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపయోగపడే గ్రంథాలయం ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. . 2016 లో రాష్ట్ర ప్రభుత్వం 17పంచాయతీలతో అనంతగిరి మండలాన్ని ఏర్పాటు చేసింది . తదనంతరం ప్రభుత్వం తండాల అభివృద్ధి లో భాగంగా నూతనంగా 2 తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి.అప్పటినుంచి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె గదుల్లో కొనసా గాయి . ప్రతి ఒక్కరికి జ్ఞాన సముపార్జన అందించే గ్రంథాలయం ఏర్పాటు చేయడంలో అధికారులు , ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు . ఎక్కడ చదవాలో .. ఏం చేయాలో దిక్కుతోచక నిరు ద్యోగ యువత అయోమయంలో పడ్డారు . ఇటీవల ఉద్యోగాల పలు నోటిఫికేషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిప్రకటించారు. అయితే పోటీ పరీక్షలకు పుస్తకాలు చదివేందుకు మండలంలో గ్రంథాలయం లేక విద్యా ర్థులు ఇబ్బంది పడుతున్నారు . ఉద్యోగ సన్నద్ధత కోసం ప్రిపేర్ కావడానికి ఇక్కట్లు ఎదుర్కొంటు న్నారు . ఇతర పుస్తకాలు , వార పత్రికలు చదవాలం టే రిటైర్డ్ ఉద్యోగులు ,విశాంత్ర ఉపాధ్యాయులుఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు . అధికారులు , ప్రజాప్రతినిధులు గ్రంథాలయం ఏర్పాటు చేయా లని పలువురు వేడుకుంటున్నారు .

### గ్రంథాలయం ఏర్పాటు చేయాలి ..

**దండెం ఉపేందర్, పాలవరం గ్రామం , అనంతగిరి మండలం**



మండల కేంద్రంలో గ్రంథాలయం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సిన పరిస్థితి..సర్కారు కొలువు సాధించడానికి పుస్తకాలు చదవాలి. అందుకు గ్రంథాలయం ఏర్పాటు చేసి పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. అధికారులు గ్రంథాలయం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

### గ్రంథాలయ ఏర్పాటు అవకాశాన్ని పరిశీలిస్తాం..

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు**



అనంతగిరి మండల కేంద్రంలో గ్రంథాలయ ఏర్పాటుకై పరిశీలన చేస్తాం. స్థలాన్ని దానంగా అందించి గ్రంథాలయం తరఫున రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే దాతలు ముందుకు రావాలి. తప్పనిసరిగా మౌలిక వసతుల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

జిల్లా గ్రంథాలయ చైర్మన్గా

### కోదాడ వాసి బాధ్యతలు...

సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా కోదాడ పట్టణానికి చెందిన వంగవీటి రామారావు బాధ్యతలు చేపట్టారు. గతంలో కోదాడ ప్రాంతానికి సంబంధంలేని సూర్యాపేట ఇతర ప్రాంతాలకు చెందినవారు చైర్మన్గా ఉన్నారు. కానీ ప్రస్తుతం చైర్మన్గా మన కోదాడవాసి ఉండడంతో తప్పనిసరిగా అనంతగిరి మండల గ్రంధానికి గ్రంథాలయం ఏర్పాటు జరుగుతుందని మండల వాసులు అభిప్రాయపడుతున్నారు.

## నూతన ఉపాధ్యాయుల వేతన బిల్లులు

# వెంటనే మంజూరు చేయాలి

### టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ టిఓకు వినతి పత్రం

**కోదాడ, నవంబర్ 27 (నినాదం న్యూస్)** 2024 డీఎస్సీ ఉపాధ్యాయుల వేతన బిల్లులు పారదర్శకంగా మంజూరు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావు, పి పాండురంగ చారి డిమాండ్ చేశారు. బుధవారం కోదాడ ఎస్ టి ఓ కు నూతన ఉపాధ్యాయుల బిల్లులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. వేతన బిల్లులో జాప్యం జరగకుండా చూడాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఇతర బిల్లులను మంజూరు చేయాలని కోరారు. నూతన ఉపాధ్యాయుల సమస్యలను టీఎస్ యుటిఎఫ్ పరిష్కరిస్తుందన్నారు. బిల్లు ల మంజూరు లో అవినీతి కి పాల్పడితే ఆందోళన చేస్తామని హెచ్చించారు.ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా కార్యదర్శి జ్యోతి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి మైసయ్య, ఎం శ్రీనివాసరావు, టీ సైదిరెడ్డి, విక్రమ్ రెడ్డి, ఆంజనేయులు, సైదులు పాల్గొన్నారు.



# శాంసంగ్ బంపరాఫర్..

## రూ.33,999లకే గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ..!



దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ మేజర్ శాంసంగ్ తన శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ ఫోన్పై భారీ డిస్కౌంట్ అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 29తో ముగియనున్న ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ ఫ్రైడే సేల్ లో 60 శాతం డిస్కౌంట్‌పై అసాధారణ ఫీచర్లు, పెర్ఫార్మెన్స్ గల శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ ఫోన్ విక్రయిస్తోంది. ఈ ఫోన్ లాంచింగ్ ధర రూ.84,999. కాగా, ఫ్లిప్ కార్ట్ ద్వారా రూ.33,999లకే లభిస్తుంది. మీరు కొత్త స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేయాలనుకుంటే.. టాప్ హై ఎండ్ ఫోన్- శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ ఫోన్ తక్కువ ధరకే సొంతం చేసుకోవచ్చు. దీనికి అదనంగా ఫ్లిప్ కార్ట్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు ద్వారా శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ ఫోన్ కొనుగోలు చేస్తే ఐదు శాతం అన్ లిమిటెడ్ క్యాష్ బ్యాక్ పొందొచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.26 వేల వరకూ ధర తగ్గింపు పొందొచ్చు.శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.4 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ ం డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ డిస్ ప్లే, ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్ 50 మెగా పిక్సెల్ వైడ్ కెమెరా, 12 మెగా పిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరా, 8 మెగా పిక్సెల్ టెలిఫోటో కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 10 మెగా పిక్సెల్స్ కెమెరా ఉంటాయి. 50-మెగా పిక్సెల్ కెమెరా 3ఎక్స్ ఆప్టికల్ జూమ్ కలిగి ఉంటుంది. శాంసంగ్ నైటోగ్రఫీ మద్దతుతో అడ్వాన్స్ డిజిటల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (వీడీఐఎస్), ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్) లతో కూడిన కెమెరా సిస్టమ్ ఉంటుంది.శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈ ఫోన్ ఎక్స్ నోస్ 2200 ఎస్వోసీ ప్రాసెసర్ కలిగి ఉంటుంది. 8 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ, 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ కలిగి ఉంటుంది. 25 వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 4500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ ఉంటుంది. కేవలం 30 నిమిషాల్లో 50 శాతం చార్జింగ్ అవుతుంది. 5జీ, బ్లూటూత్ 5.3, ఎన్ఎఫ్‌సీ, జీపీఎస్, వైర్ లెస్ పవర్ షేర్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది.

## రియల్‌మీ ప్రీమియం ఫోన్ రియల్‌మీ జీటీ7 ప్రో..




ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన ప్రీమియం ఫోన్ రియల్‌మీ జీటీ7 ప్రోను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. రియల్‌మీ జీటీ7 ప్రోఫోన్ 12 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.59,999, 16 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.65,999 పలుకుతుంది. ఈ నెల 29 మధ్యాహ్నం 12 గంటల నుంచి రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ విక్రయాలు ప్రారంభం అవుతాయి. రియల్‌మీ వెబ్‌సైట్, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్‌లో ఫోన్లు లభిస్తాయి. మార్స్ ఆరెంజ్ , గెలాక్సీ గ్రే రంగుల్లో లభిస్తుందీ ఫోన్. రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.78 అంగుళాల ఎల్టీపీఓ అమోలెడ్ ఫుల్ హెచ్డీం రిజొల్యూషన్ డిస్ ప్లే కలిగి ఉంటుంది. క్వాడ్ కర్వ్ స్క్రీన్ విత్ సపోర్ట్స్ డోల్బీ విజన్ అండ్ హెచ్డీఆర్ 10ం కంటెంట్ తో వస్తుంది. ఏజీ గ్లాస్ రేర్ ప్యానెల్ విత్ అల్యూమినియం ఉంటుంది. క్వాల్ కామ్ 8 స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ ఎస్వోసీతో వస్తున్న తొలి స్మార్ట్ ఫోన్ ఇది. సోనీ ఐఎంఎక్స్906 50-మెగా పిక్సెల్ ప్రైమరీ కెమెరా, సోనీ ఐఎంఎక్స్ 882 50-మెగా పిక్సెల్ టెలిఫోటో కెమెరా, సోనీ ఐఎంఎక్స్ 355 8-మెగా పిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ కెమెరా ఉంటుంది. ఆండ్రాయిడ్ 15 బేస్డ్ రియల్‌మీ యూఐ 6.0 వర్షన్ పై పని చేస్తుంది. మూడేండ్ల పాటు సాఫ్ట్ వేర్ అప్ డేట్స్, నాలుగేండ్ల పాటు సెక్యూరిటీ అప్ డేట్స్ అందిస్తుంది.రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ చైనా మోడల్ ఫోన్ 6500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తే, ఇండియా మోడల్ 5,800 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. ఈ బ్యాటరీకి 120 వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతు ఉంటుంది. రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ కేవలం 30 నిమిషాల్లో చార్జింగ్ అవుతుంది.

# పైనాపిల్ కేక్



పైనాపిల్ కేక్ పైనాపిల్ ముక్కలు: ఒక కప్పు, మైదా: ఒక కప్పు, నూనె: అరకప్పు, గుడ్లు: రెండు, చక్కెర: అరకప్పు, బేకింగ్ పౌడర్: ఒక టేబుల్ స్పూన్, బేకింగ్ సోడా: అర టీస్పూన్, పైనాపిల్ ఎసెన్స్: నాలుగు చుక్కలు, ఉప్పు: చిటికెడు

కావలసిన పదార్థాలు

పైనాపిల్ ముక్కలు: ఒక కప్పు, మైదా: ఒక కప్పు, నూనె: అరకప్పు, గుడ్లు: రెండు, చక్కెర: అరకప్పు, బేకింగ్ పౌడర్: ఒక టేబుల్ స్పూన్, బేకింగ్ సోడా: అర టీస్పూన్, పైనాపిల్ ఎసెన్స్: నాలుగు చుక్కలు, ఉప్పు: చిటికెడు

తయారీ విధానం

పైనాపిల్ ముక్కల్ని మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో నూనె, చక్కెర వేసి బాగా కలపాలి. చక్కెర పూర్తిగా కరిగాక గుడ్లు, మైదా, పైనాపిల్ గుజ్జు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు, పైనాపిల్ ఎసెన్స్.. ఒక్కొక్కటీ వేస్తూ బాగా కలపాలి. మిశ్రమాన్ని నూనె రాసిన కేక్ మౌల్డ్‌లో వేసి కుక్కర్‌లోగానీ, ఓవెన్‌లో గానీ 40 నిమిషాలపాటు ఉడికించుకుంటే ఘుమఘుమలాడే పైనాపిల్ కేక్ సిద్ధం

# పనీర్ జిలేబీ

పనీర్ జిలేబీ మిక్సీ జార్‌లో పనీర్, ఉప్మా రవ్వ, మైదా, కార్న్‌ఫ్లోర్, ఫుడ్ కలర్ వేసి కొద్దికొద్దిగా పాలుపోసి ముద్దలా వచ్చేలా గ్రైండ్ చేయాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి చక్కెర వేసి కొద్దిగా నీళ్లు పోసి పాకం పట్టుకోవాలి.

కావలసిన పదార్థాలు

పనీర్ తురుము: ఒక కప్పు, ఉప్మా రవ్వ: రెండు టేబుల్ స్పూన్లు, మైదా: రెండు టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్: ఒక టేబుల్ స్పూన్, పాలు: పావు కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, చక్కెర: ఒక కప్పు, రెడ్ ఫుడ్ కలర్: చిటికెడు, నూనె: వేయించడానికి సరిపడా

### తయారీ విధానం

మిక్సీ జార్‌లో పనీర్, ఉప్మా రవ్వ, మైదా, కార్న్‌ఫ్లోర్, ఫుడ్ కలర్ వేసి కొద్దికొద్దిగా పాలుపోసి ముద్దలా వచ్చేలా గ్రైండ్ చేయాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి చక్కెర వేసి కొద్దిగా నీళ్లు పోసి పాకం పట్టుకోవాలి. పాకం వచ్చాక యాలకుల పొడి వేసి దించేయాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడి చేయాలి. పనీర్ మిశ్రమాన్ని పైపింగ్ బ్యాగ్‌లో కానీ, పాలప్యాకెట్ కవర్‌లో కానీ వేసి కాగిన నూనెలో జిలేబీల్లా ఒత్తుకుని దోరగా కాల్చుకోవాలి. కాలిన జిలేబీలను పాకంలో వేసి అర గంటపాటు నానిన తర్వాత, సర్వ్ చేసుకుంటే నోరూరించే పనీర్ జిలేబీ సిద్ధం.



# ఎగ్‌ప్లాంట్ పిజ్జా

## తయారీ విధానం

తయారీకి కావలసిన పదార్థాలు

ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, ఆలివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.

తయారీ విధానం

ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఓవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం.



# బీట్‌రూట్ కుర్మా

బీట్‌రూట్ కుర్మా బీట్‌రూట్ ముక్కల్ని ఒక కప్పు నీళ్లుపోసి సన్నని మంటపై పది నిమిషాలపాటు ఉడికించి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనెవేసి వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి బాగా వేయించాలి.

కావలసిన పదార్థాలు

బీట్‌రూట్ ముక్కలు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి (పెద్దది), పచ్చిమిర్చి: రెండు, కరివేపాకు: ఒక రెబ్బ, అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, పసుపు: అర టీస్పూన్, కారం: రెండు టీస్పూన్లు, గరం మసాలా: పావు టీస్పూన్, ఉప్పు: తగినంత, జీలకర్ర, ఆవాలు: అర టీస్పూన్ చొప్పున, పెరుగు: ఒక కప్పు, నూనె: రెండు టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

బీట్‌రూట్ ముక్కల్ని ఒక కప్పు నీళ్లుపోసి సన్నని మంటపై పది నిమిషాలపాటు ఉడికించి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనెవేసి వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి బాగా వేయించాలి. అన్నీ బాగా వేగాక అల్లంవెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ఉప్పు, గరం మసాలా వేయాలి. మరో రెండు నిమిషాలు వేయించాక అందులో ఉడకబెట్టి పెట్టుకున్న బీట్‌రూట్ ముక్కల్ని నీటితోపాటు వేయాలి. ఐదు నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించి దించేయాలి. చివరగా గడ్డలు లేకుండా చిలికిన పెరుగు వేసి బాగా కలిపితే నోరూరించే బీట్‌రూట్ కుర్మా సిద్ధం



# గౌతమ్ అదానీపై గందరగోళం..

## - లోక్‌సభలో విపక్షాల గందరగోళం - అదానీ విషయంలో కేంద్ర సర్కార్ వైఖరి ఏమిటో చెప్పాలి - సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపైనా చర్చ - అసభ్యకర పోస్టుల వ్యవహారంపై కేంద్రం సీరియస్ - కఠినమైన చట్టాలను రూపొందించాన్న మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ:** అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని రాహుల్ డిమాండ్‌అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై అమెరికాలో లంచం ఆరోపణలు, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసాకాండపై బుధవారం లోక్‌సభలో విపక్షాలు గందరగోళం సృష్టించాయి. ఈ సందర్భంగా విపక్ష ఎంపీలు కూడా నినాదాలు చేశారు. దీంతో తొలుత లోక్‌సభ 12 గంటల వరకు వాయిదా పడినప్పటికీ, ఆ తర్వాత గందరగోళం కొనసాగడంతో రోజంతా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ అదానీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. "చిన్నారోపణలతో ప్రజలను అరెస్టు చేసే కేంద్రం, ఇంత పెద్ద ఆరోపణల విషయంలో ఎందుకు నిశ్శబ్దంగా ఉంది?" అని ప్రశ్నించారు.అదానీ ఈ ఆరోపణలను అంగీకరిస్తాడని ప్రభుత్వం నమ్ముతుందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.లంచాల ఆరోపణలపై ప్రభుత్వం ఎలా స్పదిస్తుందో అని ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.ఇక బీజేపీ ఎంపీ మహేష్ జెఠ్మలానీ మాత్రం ఈ వ్యవహారంపై కాంగ్రెస్‌ను విమర్శించారు.రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ఈ అంశాన్ని పెద్దది చేస్తోందని పేర్కొన్నారు. "భారత గ్రోత్ స్టోరీని అడ్డుకోవడమే యూఎస్ ఆరోపణల ఉద్దేశం," అని ఆయన అన్నారు. అదానీ గ్రూప్ కాంట్రాక్టులు పొందడంలో భారత శత్రు దేశాలను కూడా దాటగలిగిందని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఏపీలో సోషల్ మీడియా పోస్టులపై ప్రకంపనలు కొనసాగుతున్నాయి. సోషల్ మీడియాలో కించపర్చేలా పోస్టులు పెట్టారంటూ ఇప్పటికే అనేక మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయని.. నాయకులను, మహిళలను కించపరుస్తూ పోస్టులు పెడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు సైతం పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టే వాళ్లను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో మహిళలను వేధిస్తున్న వారిని ఎలా నియంత్రించాలనే అంశంపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా ఇదేరకమైన వ్యతిరేకత, ఆగ్రహం వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో.. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల వ్యవహారంపై కేంద్రం ప్రభుత్వం లోక్‌సభ వేదికగా కీలక ప్రకటన చేసింది.. అలాంటి వాళ్ల సంగతి చూస్తామంటూ పేర్కొంది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై సీరియస్ అయిన కేంద్రం.. అసభ్య కంటెంట్ నియంత్రించడానికి కఠిన చట్టం తెస్తామని కేంద్రం తెలిపింది. సోషల్ మీడియాలో అసభ్యకరమైన కంటెంట్‌ను తనిఖీ చేసేలా చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉందని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అంశంపై స్టాండింగ్ కమిటీ దృష్టిపెడుతుందని



కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. మనకు, విదేశాలకు సంస్కృతుల్లో చాలా తేడా ఉందని చెప్పారు.. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై.. ప్రశ్నోత్తరాల్లో ఎంపీ అరుణ్ గోవిల్ ప్రశ్నకు అశ్వినీ వైష్ణవ్ ఈ విధంగా జవాబు చెప్పారు. దినపత్రికలు, మీడియా సంస్థల్లో ఎడిటోరియల్ కంటెంట్‌ను తనిఖీ చేయడానికి ప్రత్యేకంగా ఎడిటోరియల్ వ్యవస్థ ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏవైనా తప్పులు దొర్లితే దాన్ని సరి చేస్తారని.. సోషల్ మీడియాలో మాత్రం అలాంటి వ్యవస్థ ఏదీ లేదంటూ తెలిపారు. యూజర్లు మీడియాకు మించి స్వేచ్ఛగా వ్యవహరిస్తోన్నారని, ఫలితంగా అనేక రకాల అసభ్యకరమైన కంటెంట్ పోస్ట్ అవుతోందని తెలిపారు. ఈ సమస్యను పార్లమెంటు స్టాండింగ్ కమిటీ టేకప్ చేస్తుందని.. కఠినమైన చట్టాలను రూపొందించాలని తాను కోరుకుంటున్నానని అశ్విని వైష్ణవ్ తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అసభ్యకరమైన కంటెంట్‌ను అరికట్టడానికి ప్రస్తుత చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ నొక్కిచెప్పారు.

# పెరిగిన ఎరువుల ధరలు... కుదేలవుతున్న రైతన్న...

## కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచిన కంపెనీలు - రైతులపై మరింత భారం పెరగని డిఏపి ధర్నధరల తగ్గింపునకు రైతుల డిమాండ్



**కోదాడ, నవంబర్ 27(నినాదం న్యూస్):** ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర పెరగట్లేదు. కానీ..! ఎరువులు, డీజిల్ ఇతర వస్తువుల ధరలు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. యాసంగి సీజన్‌లో డీఏపీ ధరలు విపరీతంగా పెరగడంతో అన్నదాతలపై భారాలు భారీగానే పడనున్నాయి. ఏటేటా సాగు వ్యయం పెరగడం వల్ల రైతులు నష్టాల పాలవుతున్న పరిస్థితి ఉంది. బస్తా డీఏపీపై రూ.300 ధర పెరగడంతో రైతులపై వందల కోట్ల భారం పడనుంది. మరోపక్క డీఏపీ ఎరువుల ధరలు పెరగడంతో బ్లాక్ మార్కెట్ పెరిగింది. పాత సరుకును కొత్త ధరలకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువుల్ని స్టాక్ చేయాల్సిన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖలు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. వ్యవసాయమే భారంగా పరిణమించిన తరుణంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరుగుతూ పోతుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ధరల పెరుగుదల మరింత భారంగా పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలంలో రైతులు అదునులో వరి సాగు చేశారు. వాతావరణం లో మార్పు ఫలితంగా వరి పైర్లకు తాటాకు తెగులు సోకింది.నివారణ చర్యలను తీసుకున్నారు. దీంతో పెట్టుబడి కూడా పెరిగింది. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వివిధ రకాల మందులను పిచికారి చేసి తెగులు నివారణకు చర్యలు తీసుకొని అదునులో వరి కోతలు కోశారు. అయితే సన్న, దొడ్డు రకం దాన్యం కొనుగోలు నిమిత్తం అధికారులు వేరువేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 17 తేమ ఉండాలని సూచించడంతో రైతులకు ప్రభుత్వం నిబంధన ఇబ్బందిగా మారింది. తప్పని పరిస్థితుల్లో సన్న రకం ధాన్యాన్ని మధ్య దళారీలకు, మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. రైతు భరోసా కింద ప్రభుత్వం ట్టుబడి సాయం అందించకపోవడం, ప్రభుత్వ నిబంధనతో ధాన్యం కొనుగోలు ద్రాలకు సన్న రకం ధాన్యాన్ని తరలించక నష్టపోతున్న రైతులకు ఎరువుల ధరల 'పెంపు కూడా తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. ఏమి పాలు పోనీ ఈ స్థితిలో రైతులు ఉండిపోయారు. ప్రతిసారి ఏదో ఒక ప్రతిబంధకము రైతులపై పడుతుండడంతో కోలుకోలేకపోతున్నారు. యాసంగి వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో కాంప్లెక్స్ ఎరువులు ధరలు పెరగడంతో ఆవేదన చెందుతున్నారు. మూడు రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు పెంచాయి. ఒక్కొక్క కాంప్లెక్స్ ఎరువు ధర 100 రూపాయలు పెరిగింది. ఈ క్రమంలో మరింత భారం పడడంతో వ్యవసాయము చేసేది ఎలా అని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రైతులపై కోట్ల రూపాయల భారం పడనుంది. ఒక్క సూర్యపేట జిల్లాలో రూ.2.50 కోట్ల రూపాయల భారం పడనుంది. 20:20:13 కాంప్లెక్స్ ఎరువు ధర ఇంతకుముందు 1200 రూపాయలు ఉండగా ప్రస్తుతము 1300 రూపాయలకు పెరిగింది. ఒక్కసారిగా 100 రూపాయలకు పెంచారు. 14: 35:14 కాంప్లెక్స్ ఎరువు ఇంతకుముందు 1700 రూపాయలు ఉండగా ప్రస్తుతము 1800 రూపాయలకు పెంచారు. 24 240 కాంప్లెక్స్ ఎరువు గతంలో 1700 రూపాయలు ఉండగా ప్రస్తుతం 1800 రూపాయలకు పెంచారు. దీంతో రైతులపై మరింత పెట్టుబడి భారం పెరగనుంది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ విలువ పెరిగి రూపాయి విలువ తగ్గడంతో ఎరువుల ధరల పెరుగుదలపై ప్రభావం చూపినట్లు పేర్కొంటున్నారు. ఎరువుల తయారీకి వాడే పాస్ప రిక్ ఆమ్లం, అమోనియా తదితర సరుకులు అవసరం. ఈ క్రమంలోనే కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడం జరిగిందని కంపెనీల నిర్వాహకులు అంటున్నారు. ఎరువుల తయారీకి ఉపయోగించే మెటీరియల్ ధరలు పెరగడం ఎరుల ధరల పెరుగుదలకు కారణమైంది. ఈ సంవత్సరము ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీరు కూడా విడుదల చేశారు. కాల్వ, వ్యవసాయ బావులు బోర్ల కింద పెద్ద ఎత్తున వరి సాగు చేస్తున్నారు. పత్తి సాగు తగ్గి వరి సాగు పెరిగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యాసంగి సీజన్లో పెద్ద ఎత్తున వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఒక్కసారిగా ఎరువుల ధరలు పెరగడంతో రైతులకు పాలు పోవడం లేదు. రైతులు వారితోపాటు ఇతర పంటల సాగు సిద్ధమవుతున్నారు. సదరు పంటలకు డిఏపి యూరియా అవసరం కావడంతో డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో పలు ఎరువుల కంపెనీలు డిఏపి, యూరియాకు, గుళికలు, నాకు యూరియాకు, పొటాషియం తదితర పోషకాలకు లింకు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు రిటైల్ డీలర్లు అంటున్నారు. వానాకాలం సీజన్లో రైతులు నష్టపోగా యాసంగిలోనైనా నష్టం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని పలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎరువుల ధరల పెంపు విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటున్నారు. డీఏపీ ధర మాత్రం పెంచలేదు. డీఏపీ ధర పెరగదని కంపెనీలు అంటున్నాయి.

# పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- హన్మకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్
- ఐనవోలు కేజీబీవీ హాస్టల్‌లో తనిఖీలు



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్):** సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హన్మకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ అధికారులను ఆదేశించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం హాస్టల్ సిబ్బందికి సూచించారు. హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలోని కేజీబీవీ హాస్టల్‌ను ఆర్డీవో రమేష్ రాథోడ్ తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఐనవోలు ఎంపీడీవోతో కలిసి తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం హాస్టల్‌ని సందర్శించి అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గదులు, కూరగాయలు, సరుకులు, పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, సౌకర్యాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు తాజా కూరగాయలు, ఆకు కూరలతో భోజనం వడ్డించాలని ఆదేశించారు. అదేవిధంగా మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంను తనిఖీ చేసి కార్యాలయంలో అభివృద్ధి పనులను సమీక్షించారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలి

- మాదకద్రవ్యాల నిరోధానికి కృషిచేయాలి
- అధికారులకు కలెక్టర్ సత్య శారద దిశానిర్దేశం



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్):** జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి సమష్టి కృషి చేసి యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత బానిస కాకుండా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాల విద్యార్థి దశ నుంచి యువత మత్తుకు బానిసగా మారుతున్నదని మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలన్నారు. డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్‌శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, డీఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ అరవింద్ కుమార్, జిల్లా వైద్యా ఆరోగ్యాధికారి సాంబశివరావు, ఎఫ్ ఆర్ ఓ సందీప్, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళీధరన్ పాల్గొన్నారు.

# సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**- జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**



**జమ్మికుంట, నవంబర్ 27 (నినాదం న్యూస్) :** ఈనెల 29,30 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరుప తలపెట్టిన సిపిఎం పార్టీ జిల్లా 10వ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోజున జమ్మికుంటలో ఆయన మాట్లాడుతూ కష్టజీవుల పక్షాన నికరంగా నిలబడుతూ, జిల్లాలో ప్రజా సమస్యలపై ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ జిల్లా పదవమాహసభలు జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకుంటామన్నారు. మహాసభలో ప్రజా సమస్యలపై తీర్మానాలు చేస్తామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు.నాటి నుండి నేటి వరకు పేద ప్రజల పక్షాన కష్టజీవుల పక్షాన దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నది ఎర్రజెండానే అన్నారు. భారత జాతీయ ఉద్యమంలో, క్రియాశీలకంగా పాల్గొన్నది ఎర్రజెండా పార్టీ అని అన్నారు, భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించింది కమ్యూనిస్టు లేనన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశభక్తి పేరుతో దేశసంపదను కార్పొరేట్లకు పప్పు బెల్లాల్ల అమ్ముతూ ఆర్థిక అసమానతలను పెంచి పోషిస్తున్నారన్నారు. స్విస్ బ్యాంకు లో ఉన్న నల్లధనాన్ని బయటకి తెచ్చి జనధన్ ఖాతాలలో 15 లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నల్లధనం రాకపోగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు కుచ్చుటోపి పెట్టి దేశం నుండి అనేకమంది కార్పొరేట్ పారిపోయారని అన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతున్న అరికట్టడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు రాకపోగా పది సంవత్సరాల కాలంలో కాలంలో సుమారు 18 లక్షల ఉద్యోగాలను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను చైతన్యం చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు అవుతున్న పేదవాడికి సొంత ఇల్లు లేకపోవడం పేద ప్రజల పట్ల పాలకుల చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతుందని అన్నారు. ఉండడానికి ఇల్లు లేక, చేసుకోవడానికి చేతినిండా పనులు దొరక్క అద్దె ఇళ్ళలో ఉంటూ అనేక అవమానాలు భరిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరుడికి తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట ఉండడానికి ఇల్లు కల్పించాలనే భారత రాజ్యాంగ స్ఫూర్తిని పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న పేదోడు సొంతింటి కల కలగానే మిగిలిపోయింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో అతి ముఖ్యమైన గ్యారంటీ సొంత ఇంటి స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయలు ఇస్తామన్న హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. రేషన్ కార్డు లేక అనేక మంది కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ సంకల్ప మహా పాదయాత్రకు తరలిన ఉద్యమకారులు

**- కరీంనగర్ నుండి వేములవాడకి పాదయాత్ర**



**జమ్మికుంట,నవంబర్ 27(నినాదం న్యూస్) :** వేములవాడ మహాశివునికి తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరాలని మొక్కులు తీర్చుటకు తెలంగాణ ఉద్యమకారులు బుధవారం తలపెట్టిన విజయ సంకల్ప మహా పాదయాత్రకు హుజురాబాద్ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు తరలివెళ్ళమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి, యువత రాష్ట్ర కో ఆర్డినేటర్ అన్నం ప్రవీణ్ తెలిపారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్ర కరీంనగర్ నుండి వేములవాడకు ప్రారంభించమని తెలిపారు...రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ యాత్ర జరుగుతుందని తెలిపారు..ఈ పాద యాత్రతో కరీంనగర్ రోడ్లన్నీ ఉద్యమకారులతో నిండిపోయయి..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యమకారులను హక్కును చేర్చుకొని 250 గజాల స్థలాన్ని ఇవ్వడం కోసం ముందుకు వచ్చిందని,నాడు ఉద్యమంలో విద్యార్థుల పాత్ర మరువలేనిదని సబ్బండ వర్గాల ప్రజలు ఏకతాటి మీదకి వచ్చి జై తెలంగాణ అనే నినాదంతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపారని యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే చాటి చెప్పిన ఘనత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డదని అన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులపై అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం చిన్న చూపు చూసిందని, ఉద్యమకారులు జీవితాలను సైతం పణంగా పెట్టారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పునాదిరాళ్లుగా ఉన్నటువంటి ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నారు. ఎంతో మంది తమ ప్రాణాలను, కుటుంబాలను వదిలి తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించారని గతాన్ని గుర్తు చేసారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు ఓరుగంటి ఆనంద్ జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి, రాష్ట్ర యువజన కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, నియోజకవర్గం అధ్యక్షులు ఊకంటి మల్లాచారి, సంపత్, వేణుగోపాల్, మల్లేష్, మూడేళ్ల కుమారస్వామి, రాజబాబు , నీల నాగరాజు,అక్కపల్లి నవీన్,సతీష్, అఫ్జల్,జిల్లా వ్యాప్తంగా 1000 మందికి పైగా ఉద్యమకారులు పాల్గొన్నారు.

# గిరిజన శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా పూల్ సింగ్ నాయక**




**కాటారం నవంబర్ 27 నినాదం న్యూస్ :** గిరిజన శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగం చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలనీ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా పూల్ సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలురు, బాలికలు కాటారంలో చలో హైదరాబాద్ కర పత్రాన్ని ఆవిష్కరించారు.గత 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతి పై విధులు నిర్వహిస్తున్న వారిని గత పాలకులు మోసం చేశారని వివరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో 1804 కాంట్రాక్టు ఉపాధ్యాయులు గిరిజన సంక్షేమ గురుకులలో 491 కాంట్రాక్టు బోధనేతర ఉద్యోగులు,గిరిజన సహకార సంస్థలలో 94 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పది సంవత్సరాలు, కెసిఆర్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు కాలయాపన చేసి మోసం చేశారని వివరించారు. గురుకులాల్లో పార్ట్ టైం ఉద్యోగులకు, 12 నెలల జీతాలు ఇవ్వాలని,స్లీపింగ్ శానిటేషన్ అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన పేర్కొన్నారు .ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చల ఎర్రయ్య , పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా రాజు, వేల్పుల సంపత్, దోమ రామకృష్ణ, మంతెన శ్రీనివాస్ , కృష్ణమాచారి సర్దార్ సింగ్, స్వప్న, పద్మ రజిత రాజశేఖర్ యాకమ్మ రజిత నాన్ టీచింగ్ స్టాఫ్ సారక్క, రాజేశ్వరి, పెంద్యాల సత్యనారాయణ అల్లం మల్లయ్య గట్టు రవీందర్, బీసుల్రశ్రీనివాస్, హట్కర్ రాజు పోలం మల్లమ్మ, మాడి రాజయ్య, పోలం చిన్నయ్య ఖమ్మం నాగయ్య పాల్గొన్నారు.

# కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయా..

## న్యాచురల్ రెమిడీస్ ఇవే..



దేశవ్యాప్తంగా చలి తీవ్రత బాగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల ప్రజలు సైతం బిగుసుకుపోతున్నారు. చలి తీవ్రత రికార్డుస్థాయిలో నమోదవుతోంది. ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం వంటి అనేక రకాల సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కీళ్ల నొప్పులు ఉన్నవారికి చలికాలం గడ్డుకాలమనే చెప్పాలి. ఎందుకంటే ఉష్ణోగ్రతలు పడిపోవడంతో శరీరం బిగుసుకుపోతుంది. కీళ్లు గట్టిపడడం, నడిచేందుకు జాయింట్లు సహకరించకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీంతో నొప్పులు ఎక్కువగా ఉంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. అయితే ఈ నొప్పులను తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలు పాటిస్తే సమస్య నుంచి బయటపడొచ్చు. ఆ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం..



**న్యాచురల్ రెమిడీస్ ఇవే..**

శీతాకాలంలో కీళ్ల నొప్పులు తగ్గించుకుని హుషారుగా తిరగాలంటే సమతుల ఆహారం తీసుకోవాలి. సల్ఫర్, క్యాల్షియం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తరచూ తినాలి. ఈ రెండింటినీ తగిన మోతాదులో శరీరానికి అందిస్తే ఎముకలు దృఢంగా మారుతాయి. తద్వారా కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చు. అలాగే క్యాబేజీ, బచ్చలికూర, సిట్రస్ ఫ్రూట్స్, టమాటా వంటివి తరచూ ఆహారంలో భాగంగా చేసుకోవాలి.

సాధారణంగా శీతాకాలంలో చాలా మంది విటమిన్–డి లోపానికి గురవుతుంటారు. శరీరానికి తగినంత ఎండ అందక ఇది జరుగుతుంటుంది. విటమిన్–డి అనేది ఎముకలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చలికాలం అది శరీరానికి అందకపోతే కీళ్ల నొప్పులు ఉన్నవారికి పెయిన్స్ మరింత తీవ్రతరం అవుతాయి. కాబట్టి వైద్యుల సలహా మేరకు విటమిన్–డి సప్లిమెంట్ తీసుకోవడం మంచిది.

చలికాలంలో తగినంత మంచినీరు తాగడం అశ్రద్ధ చేయకూడదు. సాధారణంగా ఈ కాలంలో మనకు తెలియకుండానే నీరు తాగడం తగ్గిస్తాము. అయితే కీళ్ల నొప్పులతో బాధపడేవారు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. శరీరంలో నీటి శాతం తగ్గితే డీహైడ్రేట్ అయ్యి ఫలితంగా కీళ్లనొప్పులు అధికం అవుతాయి.

శీతాకాలంలో చల్లదనానికి చాలా వరకూ శరీరం బిగుసుకుపోతుంది. అయితే కీళ్ల వాతం ఉన్నవారి పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. అందుకే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు వేడి కాపడం వంటివి చేస్తే నొప్పులు తగ్గి ఉపశమనం లభిస్తుంది.

# ‘కిస్సిక్’ కోసం శ్రీలీల ఎంత ఛార్జ్ చేసిందో తెలుసా..

## అసలు బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ని ఎందుకు వద్దనుకున్నారంటే..




ప్రపంచమంతా ఎదురు చూస్తున్న ‘పుష్ప 2’ సినిమా డిసెంబర్ 5న గ్రాండ్‌గా విడుదలయ్యేందుకు ముస్తాబవుతోంది. పుష్పరాజ్ గాడి వైల్డ్ ఫైర్ ఎలా ఉంటుందో చూసేందుకు అంతా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఆ విషయం అడ్వాన్స్ బుకింగ్స్ తెలియజేస్తున్నాయి కూడా. క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ చిత్ర ప్రమోషన్స్ ప్రస్తుతం యమా జోరుగా జరుగుతున్నాయి.

పుష్ప మూవీలో ‘ఊ అంటావా మావ. ఊఊ అంటావా’ పాట ఎంతగా పాపులర్ అయిందో తెలిసిందే. దానిని మించేలా ‘పుష్ప –2’లో ఐటెమ్‌సాంగ్‌ను ప్లాన్ చేస్తారని అభిమానులు ఎంతో వెయిట్ చేశారు. ఈ నేపథ్యంలోనే మేకర్స్ ఆదివారం ‘కిస్సిక్’ అంటూ అల్లు అర్జున్, శ్రీలీలపై తెరకెక్కించిన సాంగ్‌ను చెన్నైలో జరిగిన ఈవెంట్ లో విడుదల చేశారు. అయితే అల్లు అర్జున్ ఫ్యాన్స్ తో పాటు సినీ ప్రేమికులు ఎంతో ఎదురు చూసిన ‘కిస్సిక్’ సాంగ్ కాస్త డిసప్పాయింట్ చేసింది. ‘ఊ అంటావా మావ.. ఊఊ అంటావా’ స్థాయి అంచనాలను ఏ మాత్రం రీచ్ కాలేకపోయింది. దీంతో సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ స్టార్ట్ అయ్యాయి. స్వాగ్ కింగ్ తో పాటు డ్యాన్సింగ్ క్వీన్ కాంబోలో ఈ సాంగ్ అదిరిపోతుందని అంత భావించారు. కానీ.. ఈ సాంగ్ ట్యూన్, లిరిక్స్ అభిమానులకి నచ్చడం లేదు.

ఇక ఈ సాంగ్ కోసం మొదట బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ని సంప్రదించారు. అయితే ఆమె రూ. 6 కోట్లు డిమాండ్ చేయడంతో మేకర్స్ లైట్ తీసుకున్నారు. టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలని రూ. 2 కోట్లకు ఒప్పించేశారు. ఒకప్పుడు వరుస సినిమాలతో ఊపేసిన శ్రీలీల కెరీర్ ఇప్పుడు కాస్త డల్ అయ్యింది. ఈ సాంగ్ కోసం ఛార్జ్ చేసినా రెండు కోట్లు ఆమె ఒక సినిమా మొత్తం చేయడానికి తీసుకునే రెమ్యునరేషన్ తో సమానం. దీంతో ఈ సాంగ్ ఆమె కెరీర్ లో ఎంతో కీలకం అని చెప్పాలి.

సోయగం
Soyagam